Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 22.06.2012, శుక్రవారం సంపుటి : 32 సంచిక : 03 పేజీలు : 12, వెల : ₹ 4






# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## • రాజకీయ సముద్రంలో 'టైటానిక్' కాంగ్రెస్



వందేళ్ల క్రితం జరిగిన టైటానిక్ ఓడ ప్రమాదం గురించి చాలామంది పుస్తకాలలో, పత్రికలలో చదివి వుంటారు. ప్రపంచంలో చాలా ఎక్కువమంది 'టైటానిక్' సినిమా చూసి ఈ ఓడ ప్రమాదం గురించి తెలుసుకునే వుంటారు. సముద్రంలో మంచుకొండలను ఢీకొని టైటానిక్ నిలువునా మునిగిపోవడం, ఆ ప్రమాదంలో దాదాపు **1500**మంది ప్రయాణీకులు ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ఆనాటి టైటానిక్ ప్రమాదానికి నేడున్న రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ పరిస్థితికి ఏ మాత్రం తేడాలేదు. ఆ టైటానిక్ సముద్రంలో మంచుకొండలను ఢీకొని మునిగిపోతే, రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ మాత్రం తాను కృత్రిమంగా సృష్టించుకున్న జగన్ అనే కొండను ఢీకొని మునిగిపోబోతుంది. నిన్నటి ఉపఎన్నికల ఫలితాలలో రాష్ట్రంలో కాంగ్రెస్ స్థితి, పరిస్థితి, దుస్థితి అంతా కూడా బహిర్గతమైంది.

రాజకీయాలలో ఆత్మహత్యలు తప్ప హత్యలు వుండవనే దానికి రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీలో చోటుచేసుకున్న పరిణామాలే పెద్ద ఉదాహరణ. తెలుగుదేశం ప్రభుత్వ స్వయంకృతాపరాధమైతేనేమి, దివంగత నేత (మిగతా 7వ పేజీలో)

## జగన్ బయటకొస్తే... సర్కార్‌కు మూడినట్లే!




సెమీఫైనల్స్‌గా పేర్కొన్న 18అసెంబ్లీ, ఒక లోక్‌సభ ఉపఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్ర రాజకీయ వాతావరణం ఇప్పటికే మారివుండాలి. ఎందుకంటే ఫలితాలు అంత ప్రభావితం చేసేవిగా వున్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఈ ఫలితాలు డేంజర్ సిగ్నల్స్. ఆ పార్టీలోని నాయకుల్లో కూడా ఈసారి ఎన్నికలలో ఇక కాంగ్రెస్ అధికారంలోకి రాదనే ఒక నిశ్చితాభిప్రాయం వుంది. అయినా కూడా రాష్ట్రంలో రాజకీయ వాతావరణంలో ఎటువంటి మార్పులు లేకుండా స్థిరంగా వుందంటే దానికి కారణం వైయస్సార్‌కాంగ్రెస్ అధినేత వై.యస్.జగన్మోహన్ రెడ్డి జైలులో వుండడమే.

ఉపఎన్నికల ఫలితాలు చూస్తే ఎవరికైనా కూడా రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ (మిగతా 7వ పేజీలో)

## • అంతర్జాతీయ తెలుగు వేదికలపై లాయర్‌కు విశిష్ట పురస్కారం

మూడు దశాబ్దాల పత్రికారంగ ప్రయాణంలో 'లాయర్' ఖండాంతరాలను దాటి లక్షలసంఖ్యలో పాఠక అభిమానులను, వెలకట్టలేని వారి అభిమానాన్ని సంపాదించు కోగలిగింది. వారం వారం నెల్లూరీయులే కాదు, నేల నలుచెరుగులా వున్న లక్షలాదిమంది తెలుగువాళ్లు అంతర్జాలం ద్వారా 'లాయర్'ను వీక్షిస్తూ, 'లాయర్' కుటుంబంలో వారూ సభ్యులుగా మారుతున్నారు.

ముప్పైరెండేళ్ల ప్రస్థానంలో పాఠకుల మన్ననలు చూరగొన్న 'లాయర్' ఇప్పుడు అంతర్జాతీయ తెలుగు వేదికలపై విశిష్ట ప్రతిభాపురస్కారాలను అందుకోబోతుంది. అమెరికాలో తెలుగువారి గుండెచప్పుళ్లను ప్రతిధ్వనించే సంస్థలైన 'ఆటా' (అమెరికన్ తెలుగు అసోసియేషన్), నాటా(నార్త్‌అమెరికన్ తెలుగు అసోసియేషన్)లు 'లాయర్' జాతీయ తెలుగు వారపత్రికకు విశిష్ట ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నాయి. పత్రికా ప్రపంచంలో మూడుదశాబ్దాల బృహత్తర సేవలకుగాను జూలై 6వ తేదీ అమెరికాలోని అట్లాంటా నగరంలో జరిగే 'ఆటా' మహాసభలలో 'లాయర్'కు 'అవుట్‌స్టాండింగ్ ఫెర్ఫార్మెన్స్ ఇన్ జర్నలిజం' అవార్డును అందజేయనున్నారు. అలాగే (మిగతా 7వ పేజీలో)

PDF Compressor Free Version



# నెల్లూరు కబుర్లు

## నెల్లూరులో కేంద్ర ఆటల మంత్రి

కేంద్ర క్రీడలశాఖామంత్రి అజయ్‌మాకెన్ బుధవారం నెల్లూరుజిల్లా వచ్చారు. ఓజిలి మండలంలోని పెద్దపరియ అడ్డరోడ్డువద్ద వున్న శివంతి స్పోర్ట్స్ అకాడమీలో కొత్తగా నిర్మించ నున్న ఇండోర్ స్టేడియానికి ఆయన శంకుస్థాపన చేశారు.

## కలెక్టర్ విందు

ఉపఎన్నికలలో సమర్థవంతంగా పనిచేసిన అధికారులకు జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ 18వ తేదీన ఆత్మీయవిందు ఏర్పాటు చేశారు. జిల్లాలోని పలుశాఖల ఉన్నతాధికారులు, అధికారులు, ఈ విందులో పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్ దుమ్ముదులిపారు

ఇద్దరు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ ఆటోడ్రైవర్‌ను పట్టుకుని దేహశుద్ధి చేసిన సంఘటన సోమవారం నెల్లూరులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద చోటుచేసుకుంది. ఇద్దరు యువతులు స్కూటీ మీద వెళుతుండగా ఓ ఆటోడ్రైవర్ వెనుక నుండి వారిని చేత్తో కొట్టాడు. దాంతో వాళ్లు ఆటోను అడ్డుకుని డ్రైవర్ చెంపలు వాయించి అతనిని అక్కడేవున్న ట్రాఫిక్ పోలీసులకు అప్పగించారు.

## నెల్లూరంతా జైనుల సందడి

నెల్లూరంతా కూడా జైనుల సందడి కనిపిస్తుంది. నెల్లూరులో జరుగుతున్న సుమతీనాథ్ విగ్రహప్రతిష్ఠ మహోత్సవాల కోసం రాజస్థాన్, ఢిల్లీ, గుజరాత్, తదితర ప్రాంతాల నుండి నెల్లూరుకు దాదాపు 30వేల మంది జైనులు తరలివచ్చారు. వీరందరికీ నగరంలోని పలు ఏ.సి. కళ్యాణమండపాలను అద్దెకు తీసుకుని వసతి కల్పిస్తున్నారు. నెల్లూరు ట్రంకురోడ్డు, కాపువీధి, మండపాలవీధుల్లో వాతావరణం రాజస్థాన్ వీధులను తలపిస్తుంది.

## తపాలా ఉద్యోగుల సంఘం మహాజనసభ

నెల్లూరులోని ప్రధాన తపాలా కార్యాలయం ఆవరణలో జిల్లా తంతితపాలా ఉద్యోగుల సహకార పరపతి సంఘం 53వ వార్షికోత్సవ మహాజనసభ ఈనెల 17న జరిగింది. సంఘ అధ్యక్షుడు కె.సుధాకర్ కార్యదర్శి బి.వి.ఎన్.సురేష్, కోశాధికారి బి.సురేష్, డైరెక్టర్లు యస్.కె.మహబూబ్‌పీరా, రాజేంద్రన్, యన్.పెంచలయ్య, పి.పాండురంగారావు, యస్.యానాదిరెడ్డి మొదలగువారు ఇందులో పాల్గొన్నారు. సంఘ అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ సంఘ సభ్యులలో చనిపోయిన వారికి ఇతర సభ్యుల సహకారంతో 2లక్షల నగదు సహాయాన్ని అందిస్తామని, రుణ సదుపాయం పొందినవారు చనిపోయినట్లయితే దానిని మాఫీచేస్తామని తెలిపారు. రుణసదుపాయాన్ని 1.50లక్షల నుంచి రూ॥2లక్షలకుపైగా పెంచినట్లు తెలిపారు. సంఘసభ్యుల పిల్లలలో పదోతరగతిలో ప్రతిభచూపిన పదిమందికి ఒక్కొక్కరికి రూ॥7వేల రూపాయల ప్రోత్సాహకాన్ని అందిస్తామని తెలిపారు. సంఘసభ్యుల అభ్యున్నతికి తమవంతు కృషిచేస్తామని తెలిపారు.

### రాష్ట్రమంతా వర్షాలు

## నెల్లూరులో తుంపర్లే!

నైరుతి ఋతుపవనాలు నెలరోజులుగా 'సారొస్తారొస్తారే' అన్నపాట మాదిరిగా వూరించి ఎట్టకేలకు వచ్చేసాయి. అయితే ఋతుపవనాల మూలంగా 45డిగ్రీల ఎండతో పొగలు, సెగలు కక్కుతున్న వాతావరణం కొంత చల్ల బడిందిగాని వర్షాలు పడడం లేదు. గతంలో నర్రవాడలో వెంగమాంబ తిరునాళ్ళు జరుగుతుంటే ఖచ్చితంగా జడివానలు పట్టేవి. ఇప్పుడు వెంగమాంబ తిరునాళ్ళు కూడా అయిపోయాయి. కాని వానలు లేవు. నైరుతి ఋతుపవనాల మూలంగా ఒంగోలు మొదలుకొని హైద్రాబాద్ దాకా జోరుగా వానలు పడుతున్నాయి. కాని నెల్లూరులో మాత్రం చుక్క వానలేదు. నెల్లూరుకు ఇదేం దరిద్రమో!

## సిఐడి డిఎస్పీదే బాధ్యత

మనీస్కీం బాధితులు పూర్తిగా నష్టపోతే దానికి సిబిసిఐడి డిఎస్పీ విజయకుమార్ పూర్తి బాధ్యత వహించాల్సి వుంటుందని మనీస్కీం వ్యతిరేక న్యాయపోరాట కమిటీ కన్వీనర్, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు మందా బాబ్జీ ఒక ప్రకటనలో హెచ్చరించారు. మనీస్కీం ఏజెంట్లు నిర్వ హించిన సభకు డిఎస్పీ స్వయంగా హాజరై వాళ్లకు గడువు ఇచ్చారు. ఏ ఆధారంతో వాళ్లకు గడువు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. మనీస్కీం ప్రధాన నిందితులు నిధులు ఇస్తామని నమ్మిస్తే బాధితులు ఎవరూ నమ్మొద్దని డిఎస్పీ ఇప్పుడు వ్యాఖ్యానించడం విడ్డూరంగా వుందన్నారు. డిఎస్పీ మనీస్కీం ప్రధాన నిందితులకు, కాంగ్రెస్‌పార్టీ నాయకులకు తొత్తుగా వ్యవహరిస్తూ బాధితులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపిం చారు. రేపు మనీస్కీం ప్రధాన నిందితులను అరెస్ట్ చేసినా వారి వద్దవున్న డబ్బును, ఆస్తులను రికవరీ చేయకుండా వుండేందుకే డిఎస్పీ కుట్రపన్నారని ఆయన ఆరోపించారు.

## డాక్టర్ రాజమ్మ జయంతి



రాజమ్మ జయంతి సభలో ప్రసంగిస్తున్న వెంకట లక్ష్మి

పదారుపల్లిలోని పి.సి.రెడ్డి సమాజ మందిరంలో ఈనెల 16న ప్రముఖ సంఘసేవకురాలు దివంగత డాక్టర్ కూరపాటి రాజమ్మ జయంతిసభ క్రాంతి మహిళా మండలి ఆధ్వర్యంలో జరిగింది. ఆచార్య ఆదిత్య సభకు అధ్యక్షత వహించగా వాస్తు రామచంద్రయ్య, జి.రాజగోపాలరెడ్డి, కె.లక్ష్మీనారా యణ, ఎన్.దశరథరామిరెడ్డి, యానాదయ్య, గూడూరు లక్ష్మి, వసుంధర మొదలగువారు పాల్గొని రాజమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. వికలాం గులకు, వృద్ధులకు ఇ.గోపీనాథరెడ్డి పండ్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. క్రాంతి మహిళామండలి అధ్యక్షురాలు జి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ డాక్టర్ రాజమ్మ సేవలను జ్ఞాపకాలను వివరించారు.

## పోలీస్ ఉద్యోగాలకు రాతపరీక్ష



పోలీస్ కానిస్టేబుళ్ల ఉద్యోగాలకు ఈనెల 17న నెల్లూరులోని డి.కె.డబ్ల్యు కళాశాల, నారాయణ ఇంజనీరింగ్ కళా శాలల్లో జరిగిన రాతపరీక్షలో 4300మంది పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్ ఆధ్వర్యంలో అదనపు ఎస్పీలు చంద్రశేఖర్, నాగేశ్వరరావు, నగర ఓ.ఎస్.డి.కిషోర్‌లు ఈ పరీక్షలను పర్యవేక్షించారు. దాదాపు 100మంది పోలీసు అధికారులు వీటిని నిర్వహించారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడ్డ నలుగురిపై కేసు నమోదు చేశారు. కావలి గ్రామీణ ఎస్సై రమణ, నెల్లూరు గ్రామీణ ఎస్.ఐ జయరామసుబ్బారెడ్డిలు ఈ నలుగురిని గుర్తించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. నాలుగోనగర ఎస్సై శ్రీనివాసరావు వారిని అరెస్టుచేశారు.

## రోడ్ల మీద జంతువధ

నెల్లూరు, మైపాడురోడ్డులో కిసాన్‌నగర్, నవలాకులతోట ప్రాంతాలలో ఆదివారాలు రోడ్డుపక్కనే పొట్టేళ్లు, మేకలను వధిస్తుంటారు. ఇది ఇబ్బందిగా వుంది. ఇక్కడున్న మాంసం కొట్ల వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

## ఇది బలుపు కాదు.. వాపు



కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న ఆనం వివేకా

ఉపఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ గెలుపు వాపే కాని బలుపుకాదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పేర్కొన్నారు.

సోమవారం నెల్లూరులోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల కాంగ్రెస్ కార్యకర్తల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ సానుభూతి వల్లే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి అన్ని ఓట్లు వచ్చాయని, అయితే సానుభూతి ఎల్లకాలం పనిచేయదన్నారు. జగన్ పార్టీలో అందరూ విశ్వాసఘాతకులేనని, జగన్ అరె స్టయితే తమకు ఓట్లు పెరుగుతాయని ఆ పార్టీ నాయకులే తిరుమలకు వెళ్లి మరీ మొక్కుకుని వచ్చారన్నారు. ఉపఎన్నికలలో ఓటమితో కాంగ్రెస్ కార్యకర్తలు దిగులు చెందాల్సిన పనిలేదని, చరిత్రలో ఇలాంటి వాటినెన్నింటినో కాంగ్రెస్‌పార్టీ ఎదుర్కొంద న్నారు. జగన్ అవినీతి అక్రమాలపై అవసర మైతే ఉద్యమాలు కూడా నిర్వహించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ ఓటమిని ఒక గుణపాఠంగా తీసుకుని లోపాలను సరి దిద్దుకుని కాంగ్రెస్ పార్టీని తిరిగి ప్రజల ముందుకు తీసుకెళ్తామన్నారు. నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ అవినీతి కేసులో జగన్ జైలుకు వెళితే సాను భూతి రూపంలో ఆయన పార్టీకి ఓట్లు పడ్డా యన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమని, తాత్కాలిక సానుభూతి పవనాలు కాంగ్రెస్ పార్టీనేమీ చేయలేవన్నారు.

ఇన్‌ఛార్జ్ డీసీసీ అధ్యక్షులు చాట్ల నర సింహారావు అధ్యక్షతన జరిగిన ఈ సమా వేశంలో కాంగ్రెస్ నాయకులు ఆనం విజయ కుమార్‌రెడ్డి, పత్తి రవీంద్రబాబు, పిండి సురేష్, మేకల నరేంద్ర, రావుల వెంకట జ్యోతి, రంగయ్యనాయుడు, నరసింహులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఐనారె

## ప్రథమ వర్ధంతి

జర్నలిస్టు, రచయిత, కవి, సంపాదకుడు ఐ.నాగ మల్లారెడ్డి ప్రథమవర్ధంతిని 17వతేదీ, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ జర్నలిస్టు అసోసి యేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు రామ్మూర్తినగర్‌లో నిర్వ హించారు. కార్యక్రమానికి బిజేపీ అధ్యక్షుడు కర్నాటి ఆంజనేయరెడ్డి, జర్నలిస్టులు, ఐనారె అభిమానులు పాల్గొని నివాళుల్పరించారు.

### మోటూరు

## వర్ధంతి

ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక వ్యవస్థాపక సంపాదకుడు మోటూరు హనుమంతరావు 11వ వర్ధంతిని 18వ తేదీ నెల్లూరులో ప్రజాశక్తి సాహితీ సంస్థ నిర్వహించింది. ఇందులో భాగంగా నెల్లూరు డీయస్‌ఆర్ ప్రభుత్వ ఆసుపత్రి, టీబీ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారికి పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో సంస్థ జిల్లా కన్వీనర్ పులిగొండ్ల శ్రీరాములు, డీయస్‌ఆర్ ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి ఇన్‌చార్జ్ వైద్యులు, డా॥ వి.కృష్ణమూర్తి, ఎ.శ్రీనివాసులు సీహెచ్ హాజ రత్తయ్య, జి.కరుణానిధి, కె.బాబు, దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.

## చల్లా కుటుంబానికి ఆర్థికసాయం

జర్నలిస్టుగానే కాకుండా, కళాకారుడిగా, రచయితగా వుంటూ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన చల్లా సూర్య ప్రకాష్‌రావు కుటుంబానికి 'ది హిందూ' దినపత్రిక మాజీ నెల్లూరు కరస్పాండెంట్ నారాయణరావు రెండువేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో 17వ తేదీన ఎపియుడబ్ల్యుజే ఆధ్వర్యంలో సంతాపసభ జరిగింది. సూర్యప్రకాష్‌రావు చిత్ర పటానికి జర్నలిస్టులు పూలమాలలువేసి నివాళులర్పించారు. యూనియన్ నాయకులు, పాత్రికేయులు, ఫోటోగ్రాఫర్లు, ఎలక్ట్రానిక్‌మీడియా ప్రతినిధులు, వీడియోగ్రాఫర్లు పాల్గొని నివాళులర్పించారు.

## గుజరాత్ కానిస్టేబుల్ మృతి

జిల్లాలో ఎన్నికల బందోబస్తుకు వచ్చి అనారోగ్యంపాలై ఓ కానిస్టేబుల్ మృతిచెందాడు. గుజరాత్‌లోని నర్మద జిల్లాకు చెందిన 14వ బెటాలియన్ కానిస్టేబుల్ ప్రవీణ్‌బాయ్‌కుమార్ సోమాకంటే(30) ఎన్నికల బందోబస్తుకు వచ్చాడు. చెముదుగుంటలోని పోలీసు శిక్షణ కళాశాలలో వుంటూ ఈ నెల 6వ తేదీన వాంతులు, విరోచనాలతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ప్రవీణ్‌బాయ్‌ని మొదట పెద్దాసుపత్రికి తరలిం చారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్చారు. అయినా అతని ఆరోగ్యం మెరుగుపడక సోమవారం రాత్రి కన్నుమూసారు.

## కాలధర్మం

### మేకపాటి వెంకటసుబ్బమ్మ




ఉపఎన్నికల్లో అనూహ్యరీతిలో విజయం సాధించిన మేకపాటి సోదరులకు మాతృమూర్తి మరణం మనోక్లేశాన్ని కలిగించింది. వారి స్వగ్రామమైన మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో 17వ తేదీన శ్రీమతి మేకపాటి వెంకట సుబ్బమ్మ (89) తుదిశ్వాస వదిలారు. ముగ్గురు కుమారులు రాజమోహన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రాజశేఖరరెడ్డిల కుటుంబాలు, బంధువులు, రాజకీయ నాయకులు కార్యకర్తలు తరలివచ్చి నివాళులర్పించారు. శ్రీమతి మేకపాటి వెంకటసుబ్బమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తూ మేకపాటి సోదరులకు, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలుపుతోంది "లాయర్".

PDF Compressor Free Version



# కాంగ్రెస్ ఓటమికి కారణాలెన్నో...







**నెల్లూరు లోక్‌సభలో కాంగ్రెస్ ఓటమి ముందుగా వూహించినదే! అయితే ఇంతఘోరమైన ఓటమిని మాత్రం చాలా తక్కువమంది ఊహించారు. కాంగ్రెస్ నాయకులు సైతం తమ పార్టీకి ఓటమి తప్పదని ముందే అనుకున్నారు. అయితే ఇంత భారీ తేడాతో ఓడిపోతామని ఎవరూ అనుకోలేదు.**

ఏ ఎన్నికలలో లేని విధంగా ఈ ఎన్నికలలో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తుండింది. అది జగన్‌కు సానుకూలంగా మారింది. కేవలం మూడు నెలల క్రితం జరిగిన కోవూరు ఉప ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి కేవలం 23వేల పైచిలుకు ఓట్ల మెజార్టీ రావడం తెలిసిందే! అయితే ఈ మూడు నెలలకాలంలో రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాలు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ఓట్లను పెంచాయని చెప్పవచ్చు. పెట్రోల్ ధరలు భారీగా పెరగడంతో పాటు జగన్‌ను అరెస్ట్ చేయడం, వై.యస్.విజయమ్మ, షర్మిలలు ప్రజల్లోకి రావడంతో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ఓట్ల శాతం ఒక్కసారిగా పెరిగింది. మూడునెలల క్రితం జరిగిన కోవూరు ఉపఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థికి వచ్చిన మెజార్టీ 23వేల పైచిలుకు అయితే అదే ఈ లోక్‌సభ ఎన్నికలలో ఒక్క కోవూరు సెగ్మెంట్‌లోనే వచ్చిన మెజార్టీ 53వేల ఓట్లు పైచిలుకు. ఈ మూడు నెలల్లోనే దాదాపు 30వేల ఓట్లు పెరిగాయి.

ఈ ఎన్నికలలో జిల్లా కాంగ్రెస్ నాయకత్వం అంతా కూడా సమైక్యంగా పనిచేసింది. అభ్యర్థిగా టి.సుబ్బరామిరెడ్డి ఎంపిక సరైనదే! ఆయన కాబట్టే కాంగ్రెస్‌కు కనీసం ఆ మాత్రం ఓట్లన్నా వచ్చాయి. లేదంటే డిపాజిట్ కూడా దక్కివుండేది కాదు. అభ్యర్థుల పరంగా ఈ ఎన్నికలు జరగలేదనేది స్పష్టం. ఎందుకంటే అభ్యర్థులను తీసుకుంటే ప్రజలకు దగ్గరగా వుండడంలో, నాలుగు పనులు చేయడంలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి కంటే కూడా టి.సుబ్బరామిరెడ్డి ఎన్నోవిధాలా మేలు. గత మూడేళ్లలో నెల్లూరు ఎంపీగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి నెల్లూరుకు చేసిందేమీలేదు. ప్రజలలో ఆ ఫీలింగ్ కూడా కొంత వుంది. అయితే అది ఈ ఎన్నికలలో ప్రభావం చూపలేదు. జనం కేవలం జగన్‌ను చూసారు. జగన్ పట్ల సానుభూతి చూసారు. వై.యస్.కుటుంబం పట్ల ఆదరణ చూపారు. ఈ సానుభూతి సునామీలో మేకపాటి రాజమోహన్‌రెడ్డే కాదు ఆయన వెనుక తిరిగే కంపసముద్రం సుధాకర్‌రెడ్డిని నిలబెట్టినా అదే మెజార్టీతో గెలుస్తాడు.

కాంగ్రెస్ నాయకులు సమిష్టిగా శ్రమించినా జగన్ సునామీ ముందు వారి శ్రమంతా వృధా అయ్యింది. లోక్‌సభ పరిధిలోని 7అసెంబ్లీలోనూ భారీమెజార్టీలే! ముఖ్యంగా నెల్లూరు నగరంలో సైతం 43వేల ఓట్లు మెజార్టీ రావడం ఆశ్చర్యం కలిగించే పరిణామం. ఆనం వివేకానందరెడ్డి నేతృత్వం వహిస్తున్న నెల్లూరు రూరల్‌లోనూ దాదాపు 44వేల మెజార్టీ. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆత్మకూరులో 33వేలు. కాంగ్రెస్‌కు సరైన నాయకత్వంలేని కావలి నియోజకవర్గంలో 47వేలు మెజార్టీ.

కాంగ్రెస్ అభ్యర్థి టి.సుబ్బరామిరెడ్డి తరపున కాంపెయిన్ బాగానే జరిగింది. అయితే ఎన్నికల ప్రచారం కోసం వచ్చి కొందరు నాయకులు చేసిన అతి ప్రసంగాలు కూడా కాంగ్రెస్ ఓట్లకు గండికొట్టాయి. సుబ్బరామిరెడ్డి ఏ ఒక్కరినీ విమర్శించకుండా, ముఖ్యంగా జగన్ వైపు వేలెత్తి చూపకుండా ఎంతో హుందాగా ప్రచారం నిర్వహించుకుంటూ వెళ్లారు. కాని ఇక్కడి నాయకులు గాని, బయటనుండి వచ్చిన వాళ్లుగాని జగన్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. దీనివల్ల కాంగ్రెస్‌కు ఓట్లు తగ్గాయేగాని పెరిగింది లేదు.

సోనియాగాంధీ వచ్చి పోటీచేసినా ఈ వై.యస్. గాలిలో గెలిచే పరిస్థితి లేదు. జగన్ మీద కాంగ్రెస్ నాయకులు అతి విమర్శలు చేయకుంటే ఇంకొన్ని ఓట్లు వచ్చేవే! సుబ్బరామిరెడ్డి కాబట్టి కనీసం పరువు నిలిచింది. లేదంటే ఉదయగిరి అసెంబ్లీ మాదిరిగా మూడోస్థానం తప్పేది కాదు.

# కంభంకు కలిసిరాని కాంగ్రెస్



*కంభం విజయరామిరెడ్డికి తొలి ప్రయత్నంలోనే కాంగ్రెస్‌పార్టీ కలిసిరాకుండా పోయింది. ఉదయగిరి నియోజకవర్గంలో మేకపాటి సోదరులను ఒంటి చేత్తో ఎదుర్కోగల నాయకుడిగా ముద్రపడ్డ కంభం విజయరామిరెడ్డి తన రాజకీయ చరిత్రలో ఎప్పుడూ ఇంత ఘోరమైన ఓటమిని చవిచూడలేదు. 1985లో ఇండిపెండెంట్‌గా పోటీచేసినప్పుడు కూడా రెండోస్థానంలో నిలిచాడుగాని మూడో స్థానానికి దిగజారిపోలేదు.*

ఆయన కాంగ్రెస్‌లోకి అడుగుపెట్టడమే పెద్ద రాంగ్‌స్టెప్. 1985 నుండి తెలుగుదేశంలో వున్నాడు. ఆయనమీద ఆ పార్టీ ముద్రేవుంది. మాదాల జానకిరామ్‌లా అడపాదడపా పార్టీలు మార్చివున్నా కంభం ఈరోజు పార్టీ మారడం పెద్ద సమస్య అయ్యుండేది కాదు. ఇన్నేళ్ల పాటు తెలుగుదేశం ముద్రేయించుకుని ఇప్పుడు ఒక్కసారిగా కాంగ్రెస్‌లోకి పోవడం ఆయన అనుచరులకు చాలామందికి నచ్చలేదు. కాబట్టే ఆయన కాంగ్రెస్‌లోకి వెళ్లినా, ఆయన వెంట పెద్దగా కేడర్ వెళ్లలేదు. కంభం గనుక కాంగ్రెస్‌లో చేరకపోయివుంటే ఈ ఉపఎన్నికలలో ఆ పార్టీకి అభ్యర్థి పెద్దసమస్య అయ్యిండేది. ఉదయగిరిలో గెలవబోయేది వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీయేనని తెలిసినా కంభం పోటీకి ధైర్యం చేసాడు. గతంలో ఎప్పుడూ లేనంతగా ఆర్థికంగా ఖర్చుకు సాహసించినట్లు కూడా తెలుస్తుంది. ఎంత పోరాడినా ఆయనకు మిగిలింది మూడోస్థానమే!

## • భారీమెజార్టీలతో...

# భవిష్యత్‌లో పెద్ద చిక్కు

*నిన్నటి ఉపఎన్నికలలో భారీమెజార్టీలు సాధించామని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు సంబరపడుతుండొచ్చు. అయితే ఆ భారీమెజార్టీలే భవిష్యత్‌లో పార్టీ పరంగా మరిన్ని సమస్యలు తెచ్చిపెట్టనున్నాయి.*

ముఖ్యంగా ఈ ఉపఎన్నికలతో వైయస్సార్ కాంగ్రెస్‌లో జగన్‌కు తప్ప ఇంకెవరికీ ఓట్లు లేవనేది తేలిపోయింది. కాబట్టి జగన్ తరపున టిక్కెట్ తెచ్చుకుంటే చాలు... సులభంగా గెలవచ్చుననే ఒక ప్రచారం వచ్చేసింది. 1985లో తెలుగుదేశం పార్టీ అధినేత నందమూరి తారకరామారావు... నా తరపున కుక్కపిల్ల, చీపురుపుల్లనైనా పెట్టి గెలిపిస్తాననేవాడు. ఇప్పుడు జగన్ పార్టీ పరిస్థితి కూడా అదే అయ్యింది. ఈ ఫలితాలు చూసాక ఆయా నియోజకవర్గాల టిక్కెట్ల కోసం కుమ్ములాటలు ఎక్కువయ్యాయి.

జిల్లాలో ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల టిక్కెట్లను ఖరారు చేసారనే ప్రచారం వుంది. నెల్లూరు రూరల్, నెల్లూరు నగరం, ఆత్మకూరు, ఉదయగిరి ఈ జాబితాలో వున్నాయి. జగన్ పార్టీ తరపున టిక్కెట్ తెచ్చుకుంటే చాలు... అనామకుడైనా గెలుస్తాడనే ధీమా రాబోయే కాలంలో నాయకుల మధ్య టిక్కెట్ల కొట్లాటను తీవ్రతరం చేయబోతుంది.

## 'దేశం'లో గందరగోళం

# కేడర్ కకావికలం...







*అసలే అంతంత మాత్రంగా వున్న జిల్లా తెలుగుదేశం కేడర్ పరిస్థితి ఈ ఉపఎన్నికల ఫలితాలతో మరింత గందరగోళంగా మారింది.*

**ఉపఎన్నికలలో వచ్చిన ఓట్లను చూసి ఆ పార్టీ నాయకులు బెంబేలెత్తుతున్నారు. ఈ పార్టీ భవిష్యత్ ఏంటనే ఆలోచనలోనే కాదు, తమ భవిష్యత్ ఏంటనే దిగుల్లోపడ్డారు. దాదాపు మూడుదశాబ్దాల చరిత్రలో జిల్లాలో జరిగిన ఏ ఎన్నికలలో కూడా తెలుగుదేశంపార్టీకి ఇలాంటి దుస్థితి దాపురించలేదు. నెల్లూరు లోక్‌సభలో కనీసం డిపాజిట్ దక్కించుకోలేకపోవడమన్నది ఆ పార్టీకి ఘోర అవమానమే.**

ఇటీవలే జరిగిన కోవూరు ఉపఎన్నికలలో ఆ పార్టీ అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో పోరాడాడు. పార్టీ ఉనికిని నిలబెట్టడమే కాదు, ఓట్ల పరంగా రెండోస్థానంలో నిలబడ్డాడు.

కాని లోక్‌సభ ఎన్నికలకొచ్చేసరికి అంతా మొక్కుబడి తంతుగానే జరిగింది. ఇక్కడ ఓటమి ఖాయమనేది ముందుగానే నిర్ధారించుకున్నారు. అయినా కూడా నాకొద్దంటున్నా వంటేరు వేణుగోపాలరెడ్డిని బలవంతంగానే రంగంలోకి దించారు. అయితే ఓడిపోయే సీటు మీద రూపాయి ఖర్చుపెట్టినా దండగేననుకున్నారు. దాంతో నెల్లూరు లోక్‌సభలో మొదటిరోజు నుండి కూడా ప్రచారం మొక్కుబడి తంతుగానే సాగింది. చంద్రబాబు ఒకటికి రెండుదఫాలొచ్చి ప్రచారం నిర్వహించిపోయినా ఆ ప్రభావం ఏ మాత్రం లేదు. కోవూరు ఉపఎన్నికలలో మాదిరిగా ఈ ఎన్నికలలో పార్టీ తరపున పోరాటమే లేకుండా పోయింది. అయితే పార్టీ పరంగా కోవూరు ఎన్నికలలో సోమిరెడ్డికి అందినంత ఆర్థికసహకారం నెల్లూరు లోక్‌సభలో వంటేరు వేణుగోపాలరెడ్డికి అందలేదు. కాబట్టే ప్రచారంలో బాగా వెనుకబడిపోయాడు.

నెల్లూరు లోక్‌సభలో పార్టీ అభ్యర్థి డిపాజిట్ కోల్పోవడం మాట అటుంచితే కొన్ని నియోజకవర్గాలలో పార్టీ సీపీఎం, బీజేపీల స్థాయికి పడిపోయిందేమోననిపిస్తుంది. ఆత్మకూరు (మిగతా 10వ పేజీలో)



K.V. RATNAM garu
EDUCATIONALIST

Begin your life at Dr. Kishore's Ratnam
Start your Education at the Green Leaf School
future for tomorrow



Fun is not Education
Education is Fun
- only at... Future Vision

Activities are not Education
Education should have Activities
- only at... Future Vision

Infrastructure is not Education
Education is Infrastructure for Society
- only at... Future Vision

Facilities are not Education
Education should make use of Facilities
- only at... Future Vision

Life Skills are not Education
Education should provide Life Skills
- only at... Future Vision


FUN... • INFRASTRUCTURE • ACTIVITIES • FACILITIES • LIFE SKILLS
World of Opportunities. Academically.

For Admissions contact...

GREEN KIDS Play, LKG, UKG
GREEN PRIME 1st to 5th
GREEN TECHNO 6th to 10th

Dr. Kishore's Ratnam
Future Vision School
The Green Leaf School

Near Water Tank, Magunta Lay-out, NELLORE. Cell : 9246433550, 9246433681, 9963014407




## ఇది చెంపదెబ్బ

ఉపఎన్నికల ఫలితాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెంపదెబ్బ అని చెప్పొచ్చు. ఈ ప్రభుత్వాల మీద ప్రజలలో ఎంత వ్యతిరేకత వుందనడానికి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులకు వచ్చిన భారీ మెజార్టీలే ఉదాహరణ. ప్రభుత్వాలమీద వ్యతిరేకత ఒక్కసారిగా ప్రజల్లోగూడుకట్టుకుపోయింది. 2014ఎన్నికల్లో ఈ వ్యతిరేకత ఇంకా బలంగా పనిచేస్తుంది.

గోపాల రమేష్, నెల్లూరు.

## కళ్లు తెరవండి

మా ప్రభుత్వం ఇది చేసింది అని చెప్పుకోలేని కాంగ్రెస్ నాయకులు జగన్ అవినీతిపరుడని, కోట్లు సంపాదించుకున్నాడని విపరీతంగా ప్రచారం చేసారు. భారత రాజకీయాలలో నీతిమంతులెంటూ ప్రత్యేకంగా ఎవరూ వుండరు. అవినీతి కుంభకోణాలకు పునాదులు వేసింది కాంగ్రెస్‌పార్టీయే. ఈ పార్టీ నాయకులు ఇంకొకరి అవినీతి గురించి వేలెత్తి చూపితే ప్రజలు నమ్మేపరిస్థితి లేదు. ఈ ఉపఎన్నికల ఫలితాలను చూసైనా కాంగ్రెస్ నాయకులు కళ్లు తెరవాలి.

కె.శ్రీధర్, నెల్లూరు.

## చట్టం తీసుకురండి

ఒకసారి రాజీనామా చేసిన ప్రజాప్రతినిధులను ఉపఎన్నికలలో పోటీచేసే వీలు లేకుండా చట్టం రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇటీవల ప్రకటించారు. దేశ, రాష్ట్ర ఆర్థికవ్యవస్థలకు పెనుభారంగా మారుతున్న మరిన్ని ఉపఎన్నికలను నివారించాలంటే వెంటనే త్వరగా ఈ చట్టాన్ని అమలులోకి తీసుకురావాల్సివుంది.

ఎ.పాల్.గంగాధర్, హైదరాబాద్.

## సిబిఐ ఉవాచ!

'ఆర్థిక నేరాలు హత్యకన్నా ప్రమాదకరమైనవి' అయితే, నాణాన్ని వైరవిలాగా రిమోట్ కంట్రోల్‌తో పక్షపాతంగా దర్యాప్తుచేయడం పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణసంకటంలాంటిది కాదా? సిబిఐ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ ఆర్థిక నేరాన్ని హత్యతో పోల్చడం సరికాదు.


[illegible], నెల్లూరు.

# 'ప్రభా'తం

జన్మించినవారు మరణించక తప్పదు... మరణించినవారు జన్మించక తప్పదు... అని గీతా బోధనను త్రికరణశుద్ధిగా నమ్మే భారతావనిలో ప్రాణాలకు పెద్దగా విలువలేదన్నది పచ్చినిజం. పుట్టిన ప్రతి మనిషి ఏదో ఒకరోజు మరణించడమన్నది నిజమే అయినా, ఏరోజు దాకా ఎందుకో ఈరోజే ఉసురు తీసేస్తేపోలా అన్నట్లుగా వుంది మన ప్రభుత్వ వైఖరి. పవిత్రభారతదేశంలో మనిషి ప్రాణానికి, సంతలో గొర్రెల ప్రాణానికి పెద్ద తేడా వుండదు. జనాభాను అరికట్టు.... వున్న జనాభా ప్రాణాలను కాపాడు అనే సిద్ధాంతమే మన దేశంలో లోపిస్తుంది. ఇతర దేశాలలో మనిషి ప్రాణానికి విలువ ఎక్కువ. కాని మన దేశంలో రోజుకు కొన్ని వందల, వేల ప్రాణాలు ఏదో ఒక రూపంలో గాల్లో కలుస్తున్నా, ఆ ప్రాణాలను కాపాడాల్సిన ప్రభుత్వాలలో చలనం వుండదు.

ఒక చోట తీవ్రవాదుల దాడి జరుగుతుంది... వందమందో, రెండొందలమందో అమాయక ప్రజలు తీవ్రవాదుల దుశ్చర్యకు బలవుతారు. మన పాలకులు, ప్రతిపక్ష నాయకులూ వస్తారు... సంతాప ప్రకటనలు చేస్తారు... తీవ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తామని మైకు పట్టుకుని మరీ గట్టిగా చెబుతారు. తీవ్రవాదుల దుశ్చర్యలు అక్కడితో ఆగవు. మన పాలకుల ప్రగల్భాలూ అంతటితో ఆగవు. అలాగే సామాన్యులు బలికావడం కూడా అక్కడితో ఆగదు. దేశంలో ఏదో ఒక మారు మూల రైలు ప్రమాదం జరుగుతుంది. వందల సంఖ్యలో ప్రయాణీకులు మృతిచెందుతారు. సదరు కేంద్ర రైల్వే మంత్రులు, అధికారులు వెళ్లి కంటి తుడుపు చర్యలు చేపడతారు. సదరు ప్రమాదానికి ఒకరిద్దరిని బాధ్యులుగా చూపించి సస్పెండ్ చేసేసి చేతులు దులుపుకుంటారు. దేశంలో ఎప్పుడు ఎక్కడ ఎంతటి ప్రమాదం జరిగినా జరిగే తంతు ఇదే!

## మరణమృదంగం



**కాళేశ్వరి ట్రావెల్స్ బస్సు ప్రమాదం ప్రభుత్వాలకు ఓ హెచ్చరిక. రద్దీగావున్న ప్రాంతాలకు వెళ్లే రహదారులనే కాదు. రవాణా సదుపాయాలను సైతం మెరుగుపరచాల్సి వుంది. ప్రయాణీకుల ప్రాణాలకు భరోసా ఇవ్వగల రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయాల్సివుంది.**

ప్రపంచంలోని పలు దేశాలలో బుల్లెట్‌రైళ్లు వచ్చాయి. గంటకు 500కిలోమీటర్ల వేగంతో అవి పట్టాలమీద దూసుకుపోతుంటాయి. అవే రైళ్లను మన పట్టాల మీద పెడితే బయలుదేరిన నిముషానికల్లా పట్టాలు తప్పడం ఖాయం. అలాగే రోడ్ల మీద 300కిలోమీటర్ల వేగంతో పరుగులు తీసే వాహనాలు వచ్చాయి. ఇతర దేశాలలో ప్రయాణవ్యవస్థను అత్యంత వేగంగా మార్చుకుంటుండగా, మన దేశంలో మాత్రం ప్రమాదాల కారణంతో వేగాన్ని నియంత్రించుకుంటున్నాం. బుల్లెట్ రైళ్లను ప్రవేశపెట్టాలంటే నాణ్యమైన పట్టాలుండవు... హైస్పీడ్ వాహనాలను నడపాలంటే అందుకు తగిన విధంగా రోడ్లుండవు. ఇదే భారతదేశ దౌర్భాగ్యస్థితి.

ఆరు దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో రహదారుల అభివృద్ధి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరికి ప్రజలు భారీగా మూల్యం చెల్లిస్తున్నారు... తాజాగా కూడా చెల్లించారు. ఈ నెల 16వ తేదీ తెల్లవారక మునుపే మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లా జలకోట్ గ్రామం వద్ద షిర్డికి వెళ్తున్న కాళేశ్వర ట్రావెల్స్ వోల్వో బస్సు వంతెనపై నుండి 40అడుగుల వాగులోకి పల్టీలు కొట్టడంతో 30మంది మృత్యువాత పడ్డారు. వీరిలో 16మంది మహిళలు కాగా, టిసిఎస్ కంపెనీకి చెందిన ఉద్యోగులు ఎక్కువగా వుండడం గమనార్హం.

బస్సులో 44మంది ప్రయాణీకులున్నారు. ముందురోజు రాత్రి 6గంటలకు హైదరాబాద్ నుండి బయల్దేరిన బస్సు ఇలా ప్రమాదం కోరల్లో చిక్కుకుంది. ఈ ప్రమాదానికి ప్రధాన కారణాలు డ్రైవర్ విధుల్లో వుండి మద్యం తాగడం ఒకటైతే, నిత్యం ఎంతో రద్దీగా వుండే రహదారి వంతెనకు పక్కన కనీసం పిట్టగోడ కూడా లేకపోవడం. రెయిలింగ్, పిట్టగోడలు వంటివి లేకపోతే రాత్రివేళల్లో అత్యంత వేగంగా వచ్చే వాహనాలు ఇలాంటి చోట్ల అదుపు తప్పడానికి అవకాశాలు ఎక్కువ.

ఇవన్నీ పక్కనపెడితే దేశంలో మనుషుల ప్రాణాలను బలిగొనడంలో రహదారుల పాత్రే కీలకం. 2011లో దేశవ్యాప్తంగా లక్షా42వేల మంది ఈ రహదారుల మీద విగతజీవులయ్యారు. పెట్రోల్, డీజిల్‌లపై సుంకాల రూపంలో వందలు, వేల కోట్ల రూపాయలు జనం ముక్కుపిండి వసూలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాటిని రహదారుల అభివృద్ధికి వినియోగించకుండా తమ పార్టీలకు ఎన్నికలలో ఓట్లు రాల్చే తాత్కాలిక ప్రజాకర్షణ పథకాలకు దారిమళ్లిస్తుండడం కూడా ఈ ప్రమాదాలకి కారణం. తిరుపతి తర్వాత ఆదాయపరంగా, భక్తుల సంఖ్యాపరంగా దేశంలోనే రెండోస్థానంలో నిలుస్తున్న ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం సాయిబాబా కొలువైన శ్రీ షిరిడీ. మహారాష్ట్ర తర్వాత షిరిడీకి అత్యధిక సంఖ్యలో భక్తులు వచ్చేది ఆంధ్రాప్రాంతం నుండే! షిరిడీకి వచ్చే సగంపైగా ఆదాయం ఆంధ్రాప్రాంతం వల్లనే! హైదరాబాద్ నుండి ప్రతిరోజూ కొన్ని వందల మంది బస్సుల్లో షిరిడీకి వెళుతుంటారు. కొన్ని వందల బస్సులు హైదరాబాద్ నుండి వెళుతుంటాయి. అయితే హైదరాబాద్ నుండి షిరిడీ రహదారి మాత్రం ఎంతో అధ్వాన్నంగా వుంటుంది. మన రాష్ట్రం నుండి షిరిడీకి తగిన సంఖ్యలో రైళ్లు లేకపోవడంతో సాయిబాబా భక్తులు ఎక్కువగా ప్రైవేట్ బస్సుల మీదే ఆధారపడాల్సి వస్తుంది. రైళ్లు లేకపోవడంతో ప్రైవేట్‌బస్సులదే ఇష్టారాజ్యమవుతుంది. ప్రైవేట్ బస్సుల మధ్య పోటీతత్వం, తక్కువ సమయంలో ప్రయాణదూరాన్ని అధిగమించాలనే తాపత్రయం, అత్యంత వేగంగా ప్రయాణించగల బస్సులకు తగ్గట్లుగాలేని రహదారులు, రహదారుల పక్కనే మద్యం కొట్లు... వెరసి ప్రయాణీకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి.

## 'అంతర్'జాతీయం

* దేశంలో ప్రతి కుటుంబంలో ఒకరికి తప్పనిసరిగా ఒక బ్యాంకు ఖాతా వుండేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకులకు ఆర్థికశాఖ సూచించింది. దేశంలో 40శాతం కుటుంబాలకు మాత్రమే బ్యాంకుసేవలు అందుబాటులో వున్నాయని, వచ్చే ఆర్నెల్లలో దేశంలోని అన్ని కుటుంబాలు బ్యాంకు సేవలను ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖ కోరింది.
* భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ ఇండోనేషియా ఓపెన్ సూపర్ సిరీస్‌ను కైవసం చేసుకుంది. 17వ తేదీ జకార్తాలో జరిగిన ఫైనల్‌లో సైనా చైనాకు చెందిన జురిలిని ఓడించింది. ఈ టైటిల్‌ను వరుసగా మూడోసారి గెలుచుకుంది.
* తొలిసారిగా చైనా ఒక మహిళా వ్యోమగామిని అంతరిక్షంలోకి పంపింది. ఈ నెల 16వ తేదీ షెంజౌ-9 వ్యోమనౌక ద్వారా మహిళా వ్యోమగామి లియు యాంగ్, మరో ఇద్దరు పురుషవ్యోమగాములు అంతరిక్షంలోకి వెళ్లారు.
* అన్నాహజారే బృందం తన మీద చేసిన ఆరోపణలను కేంద్ర ఆర్థికమంత్రి ప్రణబ్‌ముఖర్జీ తిప్పికొట్టారు. తనపై ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమన్నారు.
* ఈజిప్ట్‌లో తొలిసారిగా స్వేచ్ఛాయుత వాతావరణంలో అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో ముస్లిం బ్రదర్‌హుడ్ అభ్యర్థి మొహమ్మద్ ముర్సీ విజయం సాధించారు. ఆయన ఈజిప్ట్ కొత్త అధ్యక్షుడు కానున్నారు.
* పాకిస్తాన్ ప్రధాని యూసఫ్ రజాగిలానీ ఆ పదవికి అనర్హుడని పాక్ సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. దీంతో పాక్ కొత్త ప్రధానిగా ప్రస్తుతం పాక్ మంత్రిగా వున్న మక్దూమ్ షాబుద్దీన్‌ను ఎన్నుకోవాలని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ తీర్మానించినట్లు తెలుస్తుంది.
* అంతర్జాతీయ సెరికల్చర్ కమీషన్ ప్రధాన కార్యదర్శి పదవి భారత్‌ను వరించనుంది. బెంగళూరులోని కేంద్ర పట్టు బోర్డు కార్యదర్శి ఇషితరాయ్ ఈ పదవిని చేపట్టనున్నారు.
* లౌకికవాదినే ఎన్డీఏ తరపున ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాలని బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ స్పష్టం చేసారు. ప్రధానిరేస్‌లో వున్న నరేంద్రమోడీకి చెక్ చెప్పేందుకే నితీష్ ఈ వాదాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తుంది.
* రాష్ట్రపతి పదవి రేస్‌లో నిలిచిన పి.ఎ.సంగ్మా తానుంటున్న ఎన్.సి.పి. పార్టీకి రాజీనామా చేశారు. సంగ్మా అభ్యర్థిత్వాన్ని ఎన్.సి.పి. అధినేత శరద్‌పవార్ వ్యతిరేకించడం తెలిసిందే! అయినా కూడా సంగ్మా పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి రంగంలోకి దిగారు. సంగ్మా రాజీనామాను పార్టీ ఆమోదించింది.

## వార్త వ్యాఖ్య

వార్త :- గాంధీకి, గాడ్సేకు తేడా లేకుండా చేసారు.
- ఓటర్లపై ఎంపీ రాయపాటి ఆవేదన.

వ్యాఖ్య :- *గాంధీ కుటుంబం గాడ్సేలాగా వ్యవహరిస్తుంటే మరికే ఓటరు అలా మారాడు.*

వార్త :- కాంగ్రెస్ ఓటమి స్వయంకృతమే.
- డిప్యూటీ సీఎం దామోదర రాజనరసింహ.

వ్యాఖ్య :- *కాంగ్రెస్‌ది భస్మాసుర సిద్ధాంతమంటారు!*

వార్త :- సానుభూతితోనే వైకాపా గెలుపు.
- సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం.

వ్యాఖ్య :- *ఏదో ఒకటి లేకపోతే ఇంత మెజార్టీలు రావుగా!*

వార్త :- ఉమేష్‌కుమార్ పరారయ్యారు. - కోర్టుకు సిఐడి డీఎస్పీ నివేదిక.

వ్యాఖ్య :- *ఎంత ఖర్మ చేసుకోకుంటే పోలీసులు దొంగల్లా పారిపోతారు.*

వార్త :- వై.యస్. తప్పులకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి. - వి.హెచ్.

వ్యాఖ్య :- *కాంగ్రెస్ తప్పులకు మరి ఎవరు క్షమాపణ చెప్పాలి?*

వార్త :- ఓ ఎంపీ అనుచరులు నన్ను బెదిరించారు. - శారాచౌదరి.

వ్యాఖ్య :- *త్వరలో మీకు రాజకీయ యోగం వున్నట్లుంది.*

వార్త :- మమతను వెళ్లగొట్టం... వెళ్తానంటే వద్దనం. - దిగ్విజయ్‌సింగ్.

వ్యాఖ్య :- *పొమ్మనలేక పొగపెడతారన్నమాట.*

వార్త :- కాంగ్రెస్‌కు పాలించే హక్కు లేదు.
- సీనియర్ పాత్రికేయుడు పొత్తూరి వెంకటేశ్వరరావు.

వ్యాఖ్య :- *మరి హక్కు వున్న పార్టీ ఏదన్నా వుంటే చూపండి.*

వార్త :- సంక్షోభంలో ప్రపంచ ఆర్థికవ్యవస్థ. - మన్మోహన్‌సింగ్.

వ్యాఖ్య :- *మనదేదో బాగున్నట్లు?*

వార్త :- రైతు ఇళ్లు కళకళలాడాలి. - రైతులకు సీఎం బహిరంగ లేఖ.

వ్యాఖ్య :- *ప్రతి రైతు ఇంటికీ ప్రభుత్వం తరపున రంగులు వేయిస్తే సరి!*

వార్త :- ప్రభుత్వానికి ఢోకా లేదు. - బొత్స.

వ్యాఖ్య :- *జగన్ జైల్లో వున్నంత వరకే కదా!*

వార్త :- హస్తినలో పొత్తుమూర్ఖం. - పరాజయంపై అధిష్ఠానం సీరియస్.

వ్యాఖ్య :- *ఈ పనాదంతా సోనియాగాంధీకి పొత్తుమూర్ఖంతోనే సరిపోయింది!*

PDF Compressor Free Version





నగరంలో వీధికి కనీసం 4కుక్కలు. నెల్లూరు గ్రామీణ ప్రాంతాలలో గ్రామానికో 30 కుక్కల వంతున ఉన్నాయి. వీటి కాటుకు సరాసరిన రోజుకు 10మంది బలవుతున్నారు.

## రాబిస్‌తో...

# హడలెత్తిస్తున్న స్ట్రీట్ డాగ్స్

నెల్లూరు నగరంలోనూ, గ్రామీణ ప్రాంతంలోనూ వీధికుక్కల బెడద చెపితే తీరేదిగా లేదు. వీటిలో చాలా కుక్కలకు రాబిస్‌వ్యాధి సోకివుందని వైద్య నిపుణులు తెలుపుతున్నారు. మోటారుసైకిళ్లపై వెళ్లేవారినే కాదు, కార్లను కూడా వెంబడించి నానాయాగి చేస్తున్నాయి. చిన్న పిల్లలను, సైకిల్, మోటార్‌సైకిళ్లపై వెళ్లేవారిపై లంఘించి, పిక్కలు కొరికి పెడుతున్నాయి. నెల్లూరు నగరంలో సగభాగం గ్రామీణ నియోజకవర్గంలో చేరుతుంది. నగర ఎక్స్‌టెన్షన్‌తో పాటు 40గ్రామాలు రూరల్ పరిధిలోకి వస్తాయి. కొన్ని వేలకుక్కలు నెల్లూరు నగర, రూరల్ పరిధిలో వున్నాయి. నెల్లూరు రెడ్‌క్రాస్‌లోనూ, ప్రభుత్వ ఆసుపత్రులలో, ప్రైవేటుగా కూడా కుక్క కరిస్తే రాబిస్‌వ్యాధిరాకుండా వ్యాక్సిన్‌లు అందుబాటులో వున్నాయి. అలాగే రూరల్‌మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కూడా రేబిస్ వ్యాక్సిన్‌లు అందుబాటులో వుంచామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తెలుపుతుంది. అయితే ఈ వ్యాక్సిన్‌లను తగిన విధంగా జాగ్రత్తగా భద్రపరచటం చేస్తున్నారన్న నమ్మకంలేదు. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహించిన పోలియోవ్యాక్సిన్‌నే చాలాచోట్ల సరైన పద్ధతిలో నిల్వ వుంచకపోవటం అందరికీ తెలిసిన విషయమే.


రాబిస్ సోకిన కుక్కలు, అంటువ్యాధులు సోకిన కుక్కలను ప్రత్యేక ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం ఎంతైనాఉంది. గతంలో వీధి కుక్కలను పట్టుకొని చంపేసేవారు. ప్రస్తుతం జీవకారుణ్య దృష్టితో ఇలా చేయటాన్ని అంగీకరించటం లేదు. ఇలా అని వాటి కాటుతో జనాన్ని చంపటం కూడా సరికాదుకదా? కార్పొరేషన్ కమీషనర్, మండల అభివృద్ధి అధికారి, పంచాయితీ కార్యనిర్వాహణాధికారులు చొరవతీసుకొని ప్రత్యామ్నాయ ఏర్పాటుచేయాల్సి ఉంది. జిల్లా కలెక్టర్ యుద్ధ ప్రాతిపదికన వీధికుక్కల పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేయించాల్సిన అవసరాన్ని గుర్తించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

- ఉపాధిపనుల్లో పిల్లలు

# పలకలు పట్టాల్సిన చేతులతో పారలు..

పేద ప్రజల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకం బడిఈడు పిల్లలకు శాపంగా మారింది. పలకా, బలపంతో విద్య నేర్చుకోవాల్సిన చిన్నారులు పలుగుపారలతో ఉపాధిపనులకు వెళుతున్నారు. మీటర్ల ప్రకారం పనులు చేస్తున్న కూలీలు తమ వంతు పనిని త్వరగా పూర్తిచేసుకొనేందుకు బడిఈడు పిల్లలను బడులకు పంపకుండా ఉపాధిహామీ పథకం పనులకు తీసుకొని వెళుతున్నారు. పనులు చేయిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు కూడా పిల్లల విషయంలో చూసీచూడనట్లు పోవటం శోచనీయం. బడికి పోవాల్సిన పిల్లలను పనులకు తీసుకొనిపోవటం ఒకటైతే, బాలకార్మికులచేత ఉపాధి కల్పనపనులు చేయించటం మరో క్రైమ్. ముత్తుకూరు మండలపరిధిలో జరుగుతున్న ఈ వ్యవహారంను జిల్లా అధికారులు గమనించి పిల్లలను పాఠశాలలకు పంపేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రామలింగడి రథోత్సవం




నెల్లూరుజిల్లా విడవలూరు మండలం లోని రామతీర్థం గ్రామంలో వెలసివున్న రామలింగేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవా లలో భాగంగా 17వతేదీన రథోత్సవం ఘనంగా జరిగింది. 18వతేదీ స్వామివారి కల్యాణోత్సవం, 19వ తేదీ బ్రహ్మోత్సవాల ఉపిదినంనాడు తీర్థవాది సముద్రస్నానానికి విచ్చేసిన భక్తజనానికి ఆలయనిర్వాహకులు, పోలీసుల సహకారంతో భారీ బందోబస్తు నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసు కున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి జనార్ధన్, ఛైర్మన్ శివకుమార్ తదితరులు బ్రహ్మోత్సవాలను పర్యవేక్షించారు.

# అందలమెక్కిన అద్దెలు

ముత్తుకూరు సమీపంలోని తీరప్రాంత గ్రామమైన నేలటూరులో ఇంటి అద్దెలు కొండెక్కి కూర్చున్నాయి. ఈ ప్రాంతంలో ప్రాజెక్టుల నిర్మాణం జోరందుకోవటంతో పనులు చేసే వారికి నివాసాలు అవసరం ఎక్కువైంది. దాంతో గ్రామస్తులు పనివారల అవసరాన్ని అనుసరించి ఇళ్ల అద్దెలు పెంచేశారు. నూతనంగా ఇళ్లు కూడా నిర్మిస్తున్నారు. గ్రామానికి బయట నుంచి జనం రాకడి ఎక్కువ కావటంతో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడింది. పంచాయితీవారు దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఇదిలా వుంటే ఉన్న పరిశ్రమలు, నెలకొల్పుతున్న పరిశ్రమల యాజమాన్యాలు పర్యావరణ కాలుష్య చర్యలు చేపట్టకపోవడంతో గ్రామ వాతావరణం అంతా కలుషితమైపోతుంది.

- కొత్త మద్యం విధానంతో ముందుగానే మద్యం సిండికేట్‌లు

# 'లక్' ఉంటేనే 'కిక్'షాప్



మద్యం వ్యాపారంలో అక్రమాలను అరికట్టేందుకు ఈ ఏడాది నుండి రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎక్సైజ్ పాలసీని తీసుకురాబోతుంది.

ఇప్పటివరకు ఎవడి సత్తాకొద్ది వాడు పాడుకునే కొద్ది మద్యం షాపులు దక్కేవి. గత కొన్నేళ్లుగా మద్యం షాపులకు సీల్ టెండర్లు వేలంపాటలు నిర్వహిస్తుండడం ద్వారా ప్రభుత్వానికి ఎక్సైజ్‌శాఖ ఒక పాడిఆవులా వుండింది. నాలుగేళ్ల క్రితం పాతికలక్షలు పోయిన షాపు రెండేళ్లక్రితం కోటిపాతికలక్షల దాకా పోయింది. లక్షల్లోవున్న వైన్‌షాపుల లీజులు కోట్లలోకి చేరాయి. ఇలా అధికరేట్లతో మద్యం షాపులు దక్కించుకున్న మద్యం వ్యాపారులు తర్వాత సిండికేట్‌లుగా మారి ఎమ్మార్పీ ధరలను తుంగలో తొక్కి తాము నిర్ణయించిన ధరలకే మందుబాబుల చేత మద్యం తాగించి, వాళ్ల ఇళ్లు, ఒళ్లు గుల్ల చేస్తూవచ్చారు. కోట్లు పెట్టి మద్యం షాపుల లైసెన్సులు దక్కించుకున్న వాళ్లు వీలైనంత త్వరగా పెట్టుబడిని, ఆదాయాన్ని రాబట్టుకోవాలనే ఆత్రంతో పల్లెటూర్లలో సైతం వీధికొక బెల్టు షాపును పెట్టుకుంటూపోయారు. గ్రామాలను కూడా మద్యం మత్తులో ముంచేసారు.

ఇటీవల రాష్ట్రంలో మద్యం సిండికేట్‌లపై ఏసిబి దాడులు, అరెస్టులు, ప్రత్యేక విచారణల నేపథ్యంలో మద్యం విధానంలో మార్పు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ కోణంలోనే గతంలో మాదిరిగా లాటరీ విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నారు. 10వేల జనాభావున్న గ్రామంలో మద్యంషాపుకు 32.50లక్షలు, 10వేల నుండి 50వేల లోపు జనాభావున్న పట్టణంలో 35లక్షలు, 50వేల నుండి 3లక్షల జనాభావున్న ప్రాంతంలో 46లక్షలు, 3లక్షల నుండి 20లక్షలజనాభా వున్న ప్రాంతంలో 64లక్షలు, 20లక్షలకు పైగా జనాభావున్న ప్రాంతంలో కోటి 4లక్షల రూపాయలు లైసెన్సు ఫీజుగా నిర్ణయించారు. గతంలో రెండేళ్లకు లైసెన్సులిచ్చేవారు. ఈ సంవత్సరం నుండి ఏడాదికి మాత్రమే లైసెన్సు ఇస్తారు. ఈ ఏడాదికాలం ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం అమ్మకాలు సాగించిన షాపులకు మరో సంవత్సరం వరకు లైసెన్స్ రెన్యూవల్ చేస్తారు. మొత్తం షాపులలో 12శాతం షాపులను ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ క్రింద కేటాయించనున్నారు. ఒక్కో షాపుకు వచ్చిన టెండర్లను కలిపి లాటరీ తీసి లైసెన్సుదారులను ఎంపికచేస్తారు.

అయితే ఇక్కడా మరో చిక్కునుంది. మున్నటివరకు వేలంపాటలు పూర్తయ్యాక మద్యంవ్యాపారులు సిండికేట్ అయ్యేవాళ్లు. ఇప్పుడు సిండికేట్‌లే లేరు గాని ఒక్కొక్కరు పది, పదిహేను దాకా అప్లికేషన్‌లు బినామీల పేరు మీద వేసే అవకాశాలున్నాయి.

జిల్లాలో మొత్తం 348మద్యం దుకాణాలు, 46బార్లు వున్నాయి. ఇప్పుడు మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 2010-12 సంవత్సరానికి గాను ఈ షాపుల వేలంపాట ద్వారా ప్రభుత్వానికి 348కోట్ల ఆదాయం వచ్చింది. అయితే ఇప్పుడు లాటరీ పద్ధతిలో నిర్ణయించిన ధరల ప్రకారం చూస్తే 126.68కోట్ల ఆదాయం మాత్రమే రానుంది. అంటే దాదాపు 250కోట్ల ఆదాయం ప్రభుత్వానికి తగ్గిపోయింది. 2010లో జరిగిన వేలం పాటల్లో నారాయణరెడ్డిపేట లోని మద్యం దుకాణం 2.98కోట్లకు పోయింది. కాని ఈసారి అదే దుకాణాన్ని కేవలం 32.50లక్షలతో ఎవరో ఒక అదృష్టవంతుడు చేజిక్కించుకోనున్నాడు. జిల్లాలో 348మంది ఇలాంటి అదృష్టవంతులెవరో త్వరలో తేలబోతుంది.

## గ్రామ పంచాయితీ కార్యాలయము: కలువాయి

ఆర్.సి.నెం.2/2012 తేది.18-06-2012

### టెండరు, వేలముల ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా, కలువాయి మండలం, కలువాయి గ్రామ పంచాయితీ 2012-13సంవత్సరానికి కలువాయి గ్రామ పంచాయితీ కార్యదర్శిగారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచేగాని తేది 25.06.2012 ఉదయం 11గం॥లకు ఈ క్రింద చూపబడిన పనులకు సీల్డుకవరు టెండర్లు స్వీకరించబడును అదే రోజు మధ్యాహ్నం 2.00గం॥లకు హాజరైన టెండరుదారుల సమక్షమున టెండర్లు తెరువబడును. [illegible] ఈ క్రింద చూపబడిన పనులకు [illegible] అదే రోజు మధ్యాహ్నం 4.00గం॥లకు ఈ క్రింద చూపబడిన పనులకు వేలం పాటలు [illegible] గ్రామ పంచాయితీ [illegible] మరిన్ని వివరములకు కార్యాలయ పనివేళలయందు తెలుసుకొనవలెను.

### వస్తువుల సరఫరా టెండరు వివరములు

| వ.నెం. | వివరములు | ధరావత్తు(రూ.) |
|---|---|---|
| 1 | 2012-13 సం॥నకు క్లోరినేషన్ ఎ.బి.పి. ఫారాలు సరఫరాచేయుట | 50-00 |
| 2 | 2012-13 సం॥నకు [illegible] సరఫరాచేయుట | 100-00 |
| 3 | 2012-13 సం॥నకు సిబ్బందికి యూనిఫారాలు సరఫరా చేయుట | 50-00 |
| 4 | 2012-13 సం॥నకు పి.డబ్ల్యు.ఎస్ స్కీం హెడ్‌వాటర్సుకు [illegible] సరఫరాచేయుట | 50-00 |
| 5 | 2012-13 సం॥నకు బి.హెచ్ సామాన్లు మరియు బ్లీచింగ్, సున్నం, ఫినాయిల్ సరఫరాచేయుట | 50-00 |
| 6 | 2012-13 సం॥నకు పి.హెచ్ సిబ్బందికి [illegible] సరఫరాచేయుట | 50-00 |
| 7 | 2012-13 సం॥నకు పి.డబ్ల్యుఎస్ స్కీం మోటార్లు రివైండింగ్ చేయుటకు | 50-00 |

### కాంట్రాక్టు చేసిన పోస్టులు

| వ.నెం. | వివరములు |
|---|---|
| 1 | 2012-13సం॥నకు [illegible] కాంట్రాక్టు పద్ధతిపై నెల 1కి స్థిర జీతంపై పనిచేయుటకు శ్రీ జిల్లా కలెక్టరు (పం.వి) వారి ఉత్తర్వుల మేరకు |
| 2 | 2012-13 సం॥నకు స్వీపరు పనిచేయుటకు (4)పోస్టులు కాంట్రాక్టు పద్ధతిపై నెల1కి స్థిరజీతంపై పనిచేయుటకు శ్రీ జిల్లా కలెక్టరు (పం.వి) వారి ఉత్తర్వుల మేరకు |
| 3 | 2012-13సం॥నకు [illegible] పి.డబ్ల్యుఎస్‌స్కీం పని నిర్వహించుటకు కాంట్రాక్టు పద్ధతిపై నెల 1కి స్థిరజీతంపై పనిచేయుటకు శ్రీ జిల్లా కలెక్టరు (పం.వి) వారి ఉత్తర్వుల మేరకు |
| 4 | 2012-13సం॥నకు [illegible] పి.డబ్ల్యుఎస్ స్కీం పని నిర్వహించుటకు కాంట్రాక్టు పద్ధతిపై నెల 1కి స్థిరజీతంపై పనిచేయుటకు శ్రీ జిల్లా కలెక్టరు(పం.వి)వారి ఉత్తర్వుల మేరకు |
| 5 | 2012-13 సం॥నకు [illegible] పి.డబ్ల్యు.ఎస్ స్కీం పని నిర్వహించుటకు కాంట్రాక్టు పద్ధతిపై నెల 1కి స్థిరజీతంపై పనిచేయుటకు శ్రీ జిల్లా కలెక్టరు (పం.వి) వారి ఉత్తర్వుల మేరకు |
| 6 | 2012-13సం॥నకు గ్రామపంచాయితీ మజరా గ్రామమైన [illegible] పి.డబ్ల్యు.ఎస్ స్కీం పని నిర్వహించుటకు కాంట్రాక్టు పద్ధతిపై నెల 1కి స్థిరజీతంపై పనిచేయుటకు శ్రీ జిల్లా కలెక్టరు (పం.వి) వారి ఉత్తర్వుల మేరకు |
| 7 | 2012-13సం॥నకు గ్రామంలోని వీధిదీపములు వేయుటకు కాంట్రాక్టు పద్ధతిపై నెల1కి స్థిరజీతంపై పనిచేయుటకు శ్రీ జిల్లా కలెక్టరు (పం.వి) వారి ఉత్తర్వుల మేరకు. |

### వేలంపాట వివరములు

| వ.నెం. | వివరములు | ధరావత్తు |
|---|---|---|
| 1 | 2011-12 సం॥ [illegible] చెట్లను వేలంవేయుట | 25-00 |

సం/- యు.రమేష్, పంచాయితీ కార్యదర్శి, కలువాయి గ్రామపంచాయితీ, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరుజిల్లా.

## గ్రామ పంచాయితీ కార్యాలయము: ఇనమడుగు

ఆర్.సి.నెం.36/2012 తేది.18-06-2012

### టెండర్లు మరియు వేలములు ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా, కొవ్వూరు మండలం, ఇనమడుగు గ్రామపంచాయితీ 2012-2013వ సంవత్సరమునకు కావలసిన వస్తువుల సరఫరా చేయుటకు తేది 25.06.2012న ఇనమడుగు గ్రామపంచాయితీ కార్యాలయమునందు పంచాయితీ కార్యదర్శిగారి లేదా వారి అనుమతి పొందిన వారిచేగాని ఉదయం గం.10.30ని॥ నుండి మధ్యాహ్నం గం.2.00గం॥ వరకు సీల్డుటెండర్లు స్వీకరించబడును అదే రోజు మధ్యాహ్నం గం.3.30లకు హాజరైన టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. [illegible] ఇతర వివరములు కార్యాలయము పనివేళలలో అడిగి తెలుసుకొనవచ్చును. అదే రోజు వేలములు మధ్యాహ్నం గం.3.30లకు నిర్వహించబడును.

### 1. టెండర్లు

| వ.నెం. | వివరములు | ధరావత్తు(రూ.) |
|---|---|---|
| 1 | గ్రామపంచాయితీకి అవసరమగు పారిశుద్ధ్య సిబ్బందిలో [illegible] కాంట్రాక్టు పద్ధతిన నెల 1కి పంపిన పది(10)మందిని ఏర్పాటుచేయుట | 5000/- |
| 2 | గ్రామపంచాయితీ పరిధిలోయున్న విద్యుత్ స్తంభములకు [illegible] కాంట్రాక్టు పద్ధతిన ఎలక్ట్రీషియన్ పనిచేయుటకు నెల 1కి పంపుట | 500/- |
| 3 | గ్రామపంచాయితీ పరిధిలోయున్న నెల్లూరు-[illegible] రోడ్డులో [illegible] వరకుయున్న పి.డబ్ల్యు.ఎస్.ఎస్ స్కీముకు సంబంధించిన [illegible] కాంట్రాక్టు పద్ధతిన పి.డబ్ల్యు.ఎస్ స్కీము ఆపరేటరు పనిచేయుటకు నెల 1కి పంపుట | 500/- |
| 4 | గ్రామ పంచాయితీకి అవసరమగు వీధి విద్యుత్ దీపములు మరియు విడిభాగములు మరియు ఎం.వి. ల్యాంపులు, ఎస్.వి.ల్యాంపులు, [illegible] (శ్రీ జిల్లా కలెక్టరు, ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరుజిల్లా వారి అనుమతి పొందిన కంపెనీలు మాత్రమే) చేయుట | 500/- |
| 5 | గ్రామపంచాయితీకి అవసరమగు బి.హెచ్.సామానులు సప్లయిచేయుట | 300/- |
| 6 | గ్రామపంచాయితీకి అవసరమగు పి.డబ్ల్యు.ఎస్ స్కీము విడిభాగములు మరియు [illegible] విడిభాగములు సప్లయిచేయుట | 200/- |
| 7 | గ్రామపంచాయితీకి అవసరమగు ఎల్.ఎఫ్ ఫారములు మరియు పుస్తకములు సప్లయిచేయుట | 100/- |
| 8 | గ్రామపంచాయితీకి అవసరమగు క్లోరినేషన్ సామానులు సప్లయిచేయుట | 100/- |
| 9 | గ్రామపంచాయితీ పరిధిలోని పి.డబ్ల్యు.ఎస్ మోటార్లు మరియు రీవైండింగ్, రిపేర్లు చేయుట(ఒకసంవత్సరం) | 100/- |
| 10 | గ్రామపంచాయితీకి అవసరమగు [illegible] సరఫరాచేయుట [illegible] | 100/- |

### 2. వేలములు

| వ.నెం | వివరములు | ధరావత్తు |
|---|---|---|
| 1. | గ్రామపంచాయితీలోయున్న వీధి [illegible] 2011 ఏప్రిల్ 1 నుండి జూన్ 2012 వరకుయున్న స్టాకు ప్రకారము వేలము పాట నిర్వహించుట | 100/- |
| 2. | గ్రామపంచాయితీలోయున్న పి.డబ్ల్యు.ఎస్ విడిభాగములు మరియు [illegible] 2011 ఏప్రిల్ 1 నుండి జూన్ 2012 వరకుయున్న స్టాకు ప్రకారము వేలము పాట నిర్వహించుట | 100/- |
| 3. | గ్రామపంచాయితీలోయున్న పాత [illegible] 2011 ఏప్రిల్ 1 నుండి జూన్ 2012 వరకుయున్నవి వేలము పాట నిర్వహించుట | 50/- |

సం/- బి.సురేంద్రబాబు, పంచాయితీ కార్యదర్శి, ఇనమడుగు, కొవ్వూరు మండలం, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరుజిల్లా.

# వెన్నెలకంటి వెండిపండుగ



ప్రముఖ సినీగేయరచయిత వెన్నెలకంటి వెండి పండుగ జూన్ 23వ తేదీ నెల్లూరు టౌన్‌హాల్‌లో డా॥ యస్.పి.బాల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరుగుతుంది.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావు, ఘంటసాల రత్న కుమార్, యం.వి.యస్.ప్రసాద్, భువనచంద్ర, జి.ఆనంద్, మాధవపెద్ది సురేష్, యస్.వి.యస్.శర్మ తదితరులు పాల్గొంటారు. ఈ సందర్భంగా "జీ" సరిగమప విన్నర్ జి.సాయిదేవ హర్ష, పాడుతాతీయగా విన్నర్ లక్ష్మీమేఘన, రాకేంద్‌మౌళి, ఎ.అఖిలలచే వెన్నెలకంటి పాటలపల్లకి కార్యక్రమం జరుగుతుందని సభానిర్వాహకులు పీరిశెట్టి హజరత్‌బాబు తెలియజేస్తున్నారు.

# జగన్‌ను కలిసిన కాకాణి



వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం హైద్రాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో వున్న వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని కలిసారు. ఈ సందర్భంగా నెల్లూరు లోక్‌సభ నుండి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఉదయగిరి అసెంబ్లీ నుండి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలను గెలిపించిన జిల్లా ప్రజలకు జగన్ కృతజ్ఞతలు తెలుపమన్నారని కాకాణి వెల్లడించారు.

# కామ్రేడ్ తారక్‌నాథ్ వర్ధంతి

భారతీయ స్టేట్ బ్యాంకు యూనియన్ సభ్యుల అభిమాన నాయ కుడు కీర్తిశేషులు కామ్రేడ్ వై.తారకనాథ్ 8వ వర్ధంతి సందర్భంగా రక్తదానం మరియు గొల్లపాలెంలోని చైల్డ్ ఆశ్రమందు అన్న దాన కార్యక్రమం నిర్వ హించారు. నెల్లూరు, మినీ బైపాస్‌లోని అన్నమయ్య సర్కిల్ వద్దగల బ్యాంక్ ఆర్‌బిఓ కార్యాలయంలో తారకనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి రీజినల్ మేనేజర్ కె.వి.ప్రసాద్, చీఫ్ మేనేజర్ రామకృష్ణ, తిరుపతయ్య, మోహన్‌రాజు, వెంకటేశ్వరరెడ్డి తదితర బ్యాంకు ఉద్యోగులు నివాళులర్పించారు.

## గ్రామ పంచాయితీ కార్యాలయము: ఇందుకూరుపేట బిట్-1

ఆర్.సి.నెం.1/2012 తేది.19-06-2012

### టెండరు నోటీసు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా, ఇందుకూరుపేట మండలము, ఇందుకూరుపేట బిట్-1 గ్రామపంచాయితీ ఏరియాలో ఒక సంవత్సరము పాటు అనగా తేది 01-07-2012 నుండి 30-06-2013 వరకు గ్రామ పంచాయతీ నందు వివిధ సేవలు నిర్వహించుటకు గ్రామ పంచాయతీకి సిబ్బందిని ప్రతిరోజు పంపవలెను. సదరు సేవల మీద సిబ్బందిని పంపుటకు ఆసక్తివున్న కాంట్రాక్టరు గ్రామ పంచాయతీ నందు టెండరు దాఖలు చేయవలెను. సదరు టెండర్లు దాఖలు తేది 28-06-2012 ఉదయము 10.30గం.ల నుండి మధ్యాహ్నము 1.00గం.ల వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. మరియు అదేరోజు మధ్యాహ్నము గం.3.00లకు హాజరైన టెండరుదారుల సమక్షములో సీల్డు టెండర్లు తెరువబడును. టెండర్లు దాఖలు చేయువారు ఈ క్రింద తెలిపిన విధముగా నిర్ణీత ధరావత్తు పంచాయితీ కార్యాలయములో చెల్లించి రశీదుపొంది, టెండరు షెడ్యూలును జతపరిచి టెండరు దాఖలు చేయవలెను. మిగిలిన నిబంధనలు మరియు వివరములు ఈ కార్యాలయము పనివేళలయందు వచ్చి తెలుసుకొనవచ్చును. షరతులు వర్తించును.

| వ.నెం. | వివరములు | టెండరు ధరావత్తు(రూ.) |
|---|---|---|
| 1 | 7(ఏడు) మంది స్వీపర్లు, (2) ఇద్దరు పంపు ఆపరేటర్లు, (1) ఒక ఎలక్ట్రీషియన్‌ను సప్లయి చేయవలెను | రూ.500/- |

గమనిక – పై టెండర్లు ఆమోదము తెలుపుటకు తుది నిర్ణయము పంచాయితీ వారిది. టెండరు తేదీ నాడు ప్రభుత్వము వారు సెలవు దినముగా ప్రకటించిన యెడల మరుసటిరోజు కార్యాలయము పనిచేయువేళలలో స్వీకరించబడును. విధి నిర్వహణలో ఏదైనా ప్రమాదము జరిగిన, పంచాయితీ వారు బాధ్యులు కాదు. ఎటువంటి నష్టపరిహారము చెల్లించబడదు.

సం/- పి.కృష్ణమూర్తి, పంచాయితీ కార్యదర్శి,
ఇందుకూరుపేట బిట్-1 గ్రామపంచాయితి, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరుజిల్లా.






ఋతుపవనాల కంటే హాయిగొల్పిన...

# కళాంజలి స్వరరాగాలు




నైరుతి ఋతుపవనాలు ఎండల నుండి ఉపశమనం కలిగిస్తూ చల్లదనాన్ని తీసు కొస్తే, ఈ చల్లదనానికి మరింత ఆహ్లాదాన్ని జోడిస్తూ కళాంజలి సాంస్కృతిక సంస్థ ఈ నెల 17వ తేదీ సాయంత్రం నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో వీనులవిందుగా 'పాడుతాతీయగా-2012' విజేతలచే 'స్వరఝరి' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఉరుకులు, పరుగులు పెడుతూ యాంత్రి కంగా మారిపోతున్న మనిషికి మానసిక ఆనందాన్ని కలిగించేలా ఇలాంటి సంగీత కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తున్న కళాంజలి అనంత్ పర్యవేక్షణలో ఈ స్వరఝరి ఎంతో ఆహ్లాదకర వాతావర ణంలో జరిగింది. ఆపాతమధురాలైన "రారా ప్రియ సుందర", "సరిలేరు నీకె వ్వరా నటరాజసుందర", "మామ చందమామ", "ప్రతిరాత్రి వసంతరాత్రి", "నువ్వు అడిగింది నేనేనాడైనా కాదన్నాన" వంటి పాటలు మొదలుకొని నేటి "నీ చూపుచాలు ఓ మన్మధుడా" వంటి లేటెస్ట్ పాటల వరకు ఎంతో తీయగా పాడి సంగీత ప్రియులను అలరించారు. ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సౌజన్యంతో, మరికొందరు దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీనుల విందుగా పాటలు పాడిన తేజశ్విని, హరిణి, రోహిత్, సాయిచరణ్, పరిణయ్ లను కళాంజలి తరపున పురప్రముఖులు సత్కరించారు.



# నిబంధనలు పాటించకుంటే రద్దే!

## – ఎక్సైజ్ డి.సి.

నూతన ఎక్సైజ్ విధానం ప్రకారం ఏ మద్యం దుకాణంలోనైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ పి.నాగేశ్వరరావు హెచ్చరించారు. బుధ వారం నెల్లూరులోని ఎక్సైజ్ కార్యాల యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. మద్యం షాపుల నిర్వహణకు సంబంధించి ప్రభు త్వం కొత్త పాలసీని విడుదల చేసింది. జిల్లాలో 348 మద్యంషాపులకు ఈ నెల 30తో లైసెన్సు కాలపరిమితి ముగుస్తుంది. మద్యం దుకాణాలకు సంబంధించి ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు తీసుకుంటాం. నెల్లూ రులోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాల యంలో ఏర్పాటుచేసిన బాక్సుల్లో దరఖా స్తులు వేయాలి. 26వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు కస్తూర్బా కళాక్షేత్రంలో జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ సమక్షంలో మద్యం దుకా ణాల లైసెన్సులకు లక్కీడ్రా తీయడం జరు గుతుంది. డ్రాలో వచ్చిన వారికి ఈ నెలాఖ రులోపు లైసెన్సులు మంజూరు చేస్తాం. జూలై 1వ తేదీ నుండి లైసెన్సులు పొంది నవాళ్లు మద్యం దుకాణాలు పెట్టుకోవచ్చు. లైసెన్సుల కోసం దరఖాస్తు చేసే వారు 25వేలు చెల్లించాలి. అలాగే ఏ కేటగిరిలో దుకాణానికి వేస్తున్నారో, ఆ ప్రాంతానికి నిర్ణయించిన లైసెన్సు ఫీజులో 10శాతం ఈఎండీని డి.డి. రూపంలో చెల్లించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ ప్రసాద్, సూప రింటెండెంట్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీ వచ్చేసిందోచ్...

రాష్ట్ర ఆర్థికమంత్రి ఆనం రామనారా యణరెడ్డి చొరవతో, ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు ఎట్టకేలకు నెల్లూరులో 2013-14 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభంకు అన్నీ సంసిద్ధమైనాయి. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కొండ్రు మురళి 2013వ సంవత్సరం నెల్లూరు మెడికల్‌కాలేజీలో అడ్మిషన్ల ప్రక్రి యను చేపట్టాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ కళాశాల ప్రథమంగా నెల్లూరు వైయంసిఏ గ్రౌండ్‌లోని విఆర్ కళాశాల నూతనభవనంలో ప్రారంభిస్తారు. ఈ మేరకు ఆనం రామనారాయణరెడ్డి అధికారులకు భవన వినియోగంపై అంగీకారం తెలిపారు.

150సీట్లతో కాలేజీని ప్రారంభిస్తున్నారు. కళాశాల భవనాలను నెల్లూరు డియస్ఆర్ ప్రభుత్వ ఆసుపత్రి విశాలప్రాంగణంలో మూడు దశలలో పూర్తిచేయనున్నట్లు సమాచారం. ప్రస్తుతం తొలిదశ పనులకుగాను 153 కోట్ల రూపాయలు రాష్ట్ర ఆర్థికశాఖ నిధులు కేటాయించింది. 2015నాటికి భవనాలు, మౌలికవసతులు పరికరాలు పూర్తిస్థాయిలో ఏర్పాటుచేసేం దుకు తగిన సన్నాహాలు చేపట్టి న్నారు. ప్రభుత్వపరంగా భవన నిర్మాణానికి నిధుల లేమి లేదు. ప్రస్తుతం కేటాయించిన మొత్తం కాకుండా మరో 100కోట్ల రూపా యలు కూడా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగావుంది.

నెల్లూరీయులకు స్వాతంత్రం వచ్చిన నాటి నుండి మెడికల్ కళాశాల ఒక కలలా మిగిలిపోయింది. 9సంవత్సరాల తెలుగు దేశం పాలనలో మెడికల్ కళాశాల ప్రస్తావన తీవ్రంగా జరిగింది. కీర్తిశేషులు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి తాను జిల్లాలో పర్యటించిన ప్రతిసారీ, ప్రతిచోటా మెడికల్ కళాశాల వచ్చేస్తుందంటూ ఊరించి వదిలేడు. ఆ తర్వాత నెల్లూరు నుండి ఏడు శాఖల మంత్రిగా ఉండిన సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలకు అనుమతి మంజూరైందని బాకా ఊదారు. ఆ సమ యంలో కేంద్రంలో ఆరోగ్య సహాయ మంత్రిగా ఉండిన రేణుకాచౌదరితో పాటుగా మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ కూడా నెల్లూరు పర్యటనకు విచ్చేశారు. ఆనాటి మంత్రిని నెల్లూరు మెడికల్ కళాశాల విషయం ప్రస్తావించగా, ఆమె డైరెక్టర్‌ను అడిగారు. ఆయన వెంటనే స్పందిస్తూ రాష్ట్రంనుండి తమకు ఎటువంటి దరఖాస్తు అంద లేదన్నారు. ఈ చర్చ జరిగినపుడు సోమిరెడ్డి కూడా అక్కడే ఉండటం విశేషం. ఆయన కొంత నొచ్చుకున్నారు కూడా. ఆ తర్వాత నెల్లూరు కాంగ్రెస్ లోక్‌సభ సభ్యురాలు శ్రీమతి పనబాకలక్ష్మి కొద్ది సంవత్సరాలు నెల్లూరు మెడికల్ కళాశాల విషయంను నెల్లూరు వచ్చినపుడంతా ప్రస్తావించింది. ఇదంతా జరుగుతున్న క్రమంలోనే ప్రైవేటురంగంలో నారా యణ మెడికల్ కళాశాల నెల్లూరుకు వచ్చేసింది. ఎట్టకేలకు 2011 జూలై 4వతేదీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాల నెల్లూరుకు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. అది కూడా నీటి మూటే అవుతుందనుకుంటున్న సమయంలో నిజమైంది. నెల్లూరుకు ప్రభుత్వ మెడికల్ కళా శాల వచ్చేసింది. ఆనం రామనారాయణ కృషి ఫలించింది.

PDF Compressor Free Version



# వైభవంగా... జైనుల ఉత్సవాలు




ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్

ఎక్కడో రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల లోని జైనులు అందరూ నెల్లూరులోని బంధుమిత్రులతో కలిసి సంబరాలు చేసు కునే శుభసమయంరానే వచ్చింది. నెల్లూరు మండపాలవీధిలోని సుమతీనాథ్ ఆలయ పునర్నిర్మాణం, నూతన విగ్రహాప్రాణ ప్రతిష్ఠలు ఈ వేడుకలకు కారణంగా నిలిచాయి.

ఈనెల 14న ప్రారంభమైన మహో త్సవాలకు నెల్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో భారీఎత్తున సెట్టింగులతో అయోధ్యానగర్, శాలిభద్ర పేర్లుతో టెంట్‌హౌస్, డైనింగ్ హాలు, కల్యాణవేదికలు అందర్నీ అబ్బుర పరిచేలా ఏర్పాటుచేశారు. టెంట్‌హౌస్ వద్ద జైనులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. మత గురువులు విజయరాజ్‌యశ్ సూరే శ్వరజీమహరాజ్, విజయరవీంద్ర సూరీ శ్వరజీమహరాజ్ నేతృత్వంలో రైల్వేస్టేషన్ నుండి జైనులు నృత్యాలు చేస్తూ కళాకారుల విన్యాసాలతో సంతపేట, ట్రంకురోడ్డు కాపువీధుల ద్వారా మండపాలవీధిలోని ఆలయానికి చేరుకున్నారు. 15న అయోధ్యా నగర్‌లో కుంభస్థాపన, అఖండజ్యోతి స్థాప నతో పాటు జరిగిన ధ్వజారోహణ, వేదిక పూజ, తోరణాలపూజ, మానకస్తంభం స్థాపన, క్షేత్రపాలపూజన, భైరవదేవుని పూజలలో వేలాది జైనులు పాల్గొన్నారు. మధ్యాహ్నం మహాపూజ జరుగగా, రాత్రి ముంబయి నుంచి వచ్చిన వినీత్‌గిమావత్ బృందంచే భక్తిగీతాలాపన కార్యక్రమాలు శ్రీజైన్ శ్వేతాంబర్‌మూర్తి సంఘ్, నెల్లూరు నిర్వాహకులు శాంతిలాల్‌జైన్, రాజేంద్ర జైన్ పర్యవేక్షణలో నిర్విఘ్నంగా జరిగాయి. 16న సరస్వతీ మహాదేవిపూజ, నందవర్థ పూజలు బెంగుళూరు నుండి వచ్చిన అశ్విన్ గురూజీ బృందం వేద మంత్రోచ్చారణ లతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. 17న మండపాలవీధిలో సుమతీనాథ్ దేవుని చ్యవన కల్యాణాన్ని జైన్ ఆచార్యులు రాజ్‌యశ్ సూరీశ్వర్‌జీ, రవీంద్రసూరీశ్వర్ జీలు వైభవంగా జరిపారు. ఈ సంద ర్భంగా శ్రీజైన్ శ్వేతాంబర్‌మూర్తిసంఘ్ ఆధ్వర్యంలో సంప్రదాయం ప్రకారం తీర్చి దిద్దిన రంగవల్లులు కనువిందు చేశాయి. 18న జన్మకల్యాణ మహోత్సవాన్ని, ప్రత్యేక పూజలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సాయంత్రం అయోధ్యనగర్‌లో వివిధ ప్రదేశాల నుంచి విచ్చేసిన జైనులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. 19న అయోధ్యానగర్‌లో జరిగిన సుమతీ నాథ్ దేవుని నామకరణం, విద్యాభ్యాస ఘట్టాలు కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ బి.వి. రమణకుమార్ పాల్గొని జైన్ మతాచార్యులు రాజయాశ్ సూరీశ్వర్‌జీ, రవీంద్ర సూరీ శ్వర్‌జీ ఆశీస్సులు పొందారు. ఈ సంద ర్భంగా ప్రతిష్ఠా వ్యవస్థాపక సమితి అధ్య ర్యంలో శాంతిలాల్‌జైన్, సురేష్‌జైన్, మణి లాల్‌జైన్, భారతీజైన్, జవాన్‌మల్‌జైన్‌లను సత్కరించారు. 20న భక్తిమయంగా సాగిన కల్యాణోత్సవం, పట్టాభిషేక మహోత్సవా లలో జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, డి.ఆర్వో రామిరెడ్డి, వాణిజ్య పన్నుశాఖ కమీషనర్ ఇంతియాజ్‌లు పాల్గొన్నారు. 21న అయోధ్యానగర్ నుంచి మొదలైన దీక్షా ధారణ ఊరేగింపు మండపాలవీధిలోని మందిరానికి కోలాహలంగా చేరింది. రాజస్థాన్, గుజరాత్ మొదలైన రాష్ట్రాల నుంచి వచ్చిన కళాబృందాలు, ఏనుగులు, ఒంటెలు రథాలతో సాగిన ఈ ఉత్సవాల్లో వయస్సు తారతమ్యం ఎరుగక పిల్లలు యువతీ, యువకులు, వృద్ధులు ఆనందంగా పాల్గొన్నారు. 22న ముఖ్యఘట్టమైన సుమతీనాథ్ తీర్థంకరుని విగ్రహాప్రాణ ప్రతిష్ఠలో విశేషపూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జైన్‌మత గురువులు నిర్వహించగా కనివినీ ఎరుగని తీరులో హెలికాప్టర్ ద్వారా పుష్పాలు ముత్యాల తలంబ్రాల వర్షాన్ని కురిపించి జైనసం స్మృతి వైభవాన్ని ప్రదర్శించి అందర్నీ సంభ్ర మాశ్చర్యాల్లో ముంచెత్తారు.



సాంస్కృతిక వేడుకలలో ఓ సన్నివేశం



వేడుకలలో ఉత్సాహంగా పాల్గొన్న యువతులు

## జన ప్రభంజనానికి అడ్డొస్తే... అంతే సంగతులు!

రాష్ట్రంలో జగన్ పట్ల జన ప్రభంజ నాన్ని, జనాభిమానాన్ని ఎవరూ అడ్డుకోలే రని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నెల్లూరులోని రాజన్నభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభంజనాన్ని అడ్డుకోవాలని చూస్తే... వారికి రాజకీయ భవిష్యత్ కూడా వుండ దన్నారు. ఉపఎన్నికలలో ప్రజలిచ్చిన తీర్పుకు కాంగ్రెస్ నాయకులు వక్రభాష్యం చెబుతున్నారు. ఓటమిని హుందాగా స్వీకరించలేకపోతున్నారు. కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీలు కుమ్మక్కయినా ఈ ఎన్నికలలో పరువు నిలబెట్టుకోలేక పోయారు. జగన్మోహన్‌రెడ్డి పట్ల ప్రజలు పెంచుకున్న ప్రేమాభిమానాలకు భారీ మెజార్టీలే కొలమానం. నెల్లూరు రూరల్ మండలంలో 32పంచాయితీలలో 26 పంచాయితీలలో వైయస్సార్‌సిపికి 10వేల మెజార్టీ వచ్చింది. ఈ మెజార్టీలు చూసి ఆనం సోదరులు తలదించుకోవాలి. ఉప ఎన్నికలలో నా సత్తా ఏంటో చూపిస్తానన్న రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఈ మెజార్టీకి ఏం సమాధానం చెబుతారని కోటంరెడ్డి ప్రశ్నించారు. పదవులు శాశ్వతం కాదని, ప్రజల్లో మంచి నాయ కుడిగా గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయ త్నించండని ఆయన వివేకాకు సూచిం చారు. వైయస్సార్‌సిపి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జగన్ జైలు నుండి బయటకు రాగానే తాను తలపెట్టిన 141 రోజుల మహాపాదయాత్రను తిరిగి మొదలు పెడతానన్నారు. పాదయాత్ర ఇప్పటికే వందరోజులు పూర్తి చేసుకుందని మిగతా 41రోజులు కూడా తిరుగుతానన్నారు.

ఈ సమావేశంలో వైయస్సార్‌సిపి నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సి.హెచ్.జనా ర్ధన్‌రెడ్డి, కె.వి.రాఘవరెడ్డి, మందా బాబ్జీ, తాటి వెంకటేశ్వర్లు, దార్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

## 'టైటానిక్' కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)

వై.యస్.రాజశేఖరరెడ్డి కృషి ఫలితమైతేనేమి 2004లో రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ మంచి మెజార్టీతో అధికారంలోకి రాగలిగింది. 2004 నుండి 2009 మధ్య కాంగ్రెస్‌పార్టీ పట్ల ప్రజలు పెంచుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం ముఖ్యమంత్రిగా వై.యస్.రాజశేఖరరెడ్డి ఎన్నెన్ని అగచాట్లుపడ్డాడో ఆయనకే తెలుసు. రెండోసారి ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవడమనేది కత్తిమీద సామే! ప్రజలలో ఎక్కడా అసంతృప్తి కలిగించకూడదు. అసౌకర్యం రానీయకూడదు. పన్నుల రూపంలో వాళ్లకు ఎక్కడా నొప్పి తగలనీయకూడదు. ఐదేళ్లపాటూ వై.యస్. అదే చేసాడు. కాంగ్రెస్ పట్ల ప్రజలు వ్యతిరేకత పెంచుకునే మార్గాలకు ఆయన ఎక్కడా ఆస్కారమివ్వలేదు. కాబట్టే 2009లో సీట్లు కొంచెం తగ్గినా కాంగ్రెస్‌పార్టీ తిరిగి అధికారంలోకి రాగలిగింది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీని వై.యస్. ఇంత పటిష్టంగా నిర్మిస్తే, ఆయన మరణానంతరం ఆ పార్టీ పరిస్థితి కుక్కలు చింపిన విస్తరి అయ్యింది.

ముఖ్యంగా వై.యస్. తనయుడు జగన్‌ను పార్టీని వీడివెళ్లేలా కాంగ్రెస్ అధినాయకత్వం వ్యవహరించింది. జగన్ ఓదార్పుయాత్రకు అడ్డు చెప్పకుండా ఆయన మానాన ఆయన్ని వదిలేసివుంటే సరిపోయేది. ఆయన ఆ ఓదార్పుయాత్రలే చేసుకుంటూ కాంగ్రెస్‌లోనే వుండేవాడు. కేంద్రంలో ఏదన్నా సహాయమంత్రి పదవి ఇచ్చివున్నా అప్పటికి సర్దుకుని వుండేవాడు. కాని కాంగ్రెస్ అధిష్టానం వై.యస్. కుటుంబం పట్ల కక్షపూరితంగా వ్యవహరించింది. రాష్ట్రంలోని కొందరు కాంగ్రెస్ నాయకులు వై.యస్.కుటుంబం మీద, జగన్ మీద అతిగా విమర్శలు చేసారు. కాంగ్రెస్‌లో మేమెందుకుండాలనే పరిస్థితిని వాళ్ల ముందుంచారు. ఫలితంగానే జగన్ బయటకు రావడం, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని స్థాపించడం, అదే ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీని నామరూపాలు లేకుండా చేసే రాజకీయశక్తిగా అవతరించడం చకచకా జరిగిపోయాయి.

కాంగ్రెస్ అనే టైటానిక్ ఇప్పటికే జగన్ అనే కొండను ఢీకొట్టి నడిసముద్రంలో పెను ప్రమాదంలో చిక్కుకుంది. ఇది మునుగుతుందా? లేదా ప్రమాదం నుండి బయట పడుతుందా అనేది రేపు నిర్ణయించాల్సింది ప్రజలే!

## సర్కార్‌కు మూడినట్లే

(మొదటిపేజీ తరువాయి)

మునిగిపోయే నావలా కనిపిస్తుంది. బయటవాళ్లకే అలా కనిపిస్తుంటే... ఇక ఆ నావలో ప్రయాణించే నాయకులకు ఎలా అనిపించాలి. ఖచ్చితంగా ప్రమాదంలో వున్నామనే సంకేతాలు వారికి అందుతాయి. అందుకనే మునిగే నావలో నుండి బయటపడాలని చాలామంది నాయకులు కోరుకుంటున్నారు. ఎందుకంటే చొక్కాలు మార్చినంతగా పార్టీలు మార్చడమనేది నేడున్న రాజకీయనాయకులకు అధమంగా అనుకున్నా 90శాతం మందికి వెన్నతోపెట్టిన విద్య. కాంగ్రెస్‌పార్టీ నుండి బయటకు రావాలనుకుంటున్నవాళ్లు తెలుగుదేశం వైపు చూడడం లేదు. కాంగ్రెస్ కంటే మెరుగ్గా ఆ పార్టీ పరిస్థితి ఏమీ లేదు. కాబట్టి వీరికి ప్రత్యామ్నాయం వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీయే. ఎప్పుడు ఎన్నికలొచ్చినా వైయస్సార్ కాంగ్రెస్ ప్రభంజనం ఖాయమనేది నిన్నటి ఉపఎన్నికల ఫలితాలతోనే తేటతెల్లమైంది.

ఈ తరుణంలో కాంగ్రెస్‌ను వదిలి రావడానికి చాలామంది ఎమ్మెల్యేలు సిద్ధంగా వున్నట్లు తెలుస్తుంది. ఎంతకాదన్నా బయటకు రావడం మొదలుపెడితే పాతికమందికి తక్కువకాకుండా ఎమ్మెల్యేలు వచ్చే అవకాశాలున్నాయి. వీరిలో గతంలో జగన్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించి తిరిగి తమ పనుల కోసం కాంగ్రెస్‌లోనే సర్దుకున్న ఎమ్మెల్యేలు కూడా వున్నారు. కాంగ్రెస్ నుండి ఇరవై, పాతిక మంది దాకా ఎమ్మెల్యేలు బయటకు వస్తే ప్రభుత్వం నిలిచే పరిస్థితి లేదు. అయినా ఇదంతా ఎందుకు జరగడం లేదంటే జగన్ జైలులో వుండబట్టే. కాంగ్రెస్ నుండి బయటికొద్దామనుకుంటున్న ఎమ్మెల్యే లకు రేపు ఎన్నికలలో సీటు మీకే అని గ్యారంటీ ఇచ్చే నాయకుడు లేడు. వైయస్సార్ కాంగ్రెస్ తరపున మాట చెప్పాల్సింది ఆయనే! ఇంకెవరు చెప్పినా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నమ్మి బయటకు రాలేరు.

జగన్ అరెస్ట్‌కాగానే సంజయ్ కృష్ణరంగారావు, ఆళ్ల నాని వంటి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ బాటలో మరికొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నారు. అయితే జగన్ బయటకొస్తే గాని వీళ్లు కాంగ్రెస్ నుండి బయటకు వచ్చే పరిస్థితి లేదు.

## విశిష్ట పురస్కారం

(మొదటిపేజీ తరువాయి)

32ఏళ్లుగా పత్రికారంగంలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకుని సమాజానికి తనవంతు సేవలందిస్తున్న 'లాయర్' కృషిని గుర్తించి 'నాటా' వారు "ఎక్సలెన్స్ ఇన్ జర్నలిజం ఎండ్ కమ్యూనిటీ సర్వీస్' అవార్డును అందజేయనున్నారు. జూన్ 29వ తేదీ రాత్రి 7గంటలకు హౌస్టన్‌లోని హిల్టన్ హోటల్‌లో జరిగే 'నాటా' వేడుకలలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి 'లాయర్' పక్షాన ఈ పురస్కారాలను స్వీకరించనున్నారు.

## నెల్లూరు రోటరీ నూతన కార్యవర్గం

నెల్లూరు రోటరీక్లబ్ 2012-13 సంవత్సరానికి నూతన కార్యవర్గ సభ్యుల నియామక కార్యక్రమం ఈ నెల 28వ తేదీ నెల్లూరు రోటరీ ఆడిటోరియంలో సాయంత్రం 7గంటలకు జరుగనుంది. ఆర్ఐ డిస్ట్రిక్ట్ 3020 పూర్వ గవర్నర్(2002-03) పిడిజి శ్యామ్‌ముప్ప వీరి నియామకం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు నగర కార్పోరేషన్ కమీషనరు టియస్ఆర్ అంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కె.మధుసూధనరావు ప్రెసిడెంట్‌గా, కె.వి.సుబ్రహ్మణ్యం సెక్రెటరీగా, పదవీబాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్స్ అందరూ పాల్గొననున్నారు.

# కదంబం

## గీతా'కారక'చిలుకలు

కె.ఆంజనేయకుమార్
విజయవాడ. 94905 97282

నీ తాలోకచిలుక, తన వనానికి సెలవుపెట్టి
పుకరందం పీల్చే పనిని వాయిదా వేసి
'ఆకులు తినే పనికోసం...
వెనక్కి వెళ్ళే 'దశ' లేకపోవచ్చు...కానీ...
ఈ గీతా'కారక'చిలుకలు
తమ కొలువుకి సెలవుపెట్టి
మదిని తొలుస్తున్నా పని కోసం అన్నీ వాయిదా వేసి
'ప్రాథమిక దశ'కి వెళ్ళే దృశ్యాన్ని చూడొచ్చు!

కొన్ని యూనివర్సిటీ క్యాంపసుల్లోనో...
అన్ని కాలేజీ కారిడార్లలోనో...
ఒకే వయసువారు చెట్టాపట్టాలేసుకుని తిరగడం చూడొచ్చు...
కానీ...
అశోక్‌నగర్ వీధుల్లోనూ... విద్యుత్‌నగర్ దోవల్లోనూ...
అన్ని వయస్సుల వారు పుస్తకాల తట్టలెత్తుకుని
పొట్టలేసుకుంటూ...
క్షణం తీరికలేకుండా... కణంకణం అక్షరాలకై అర్రులు చాస్తుంటారు!
ఈ దారుల్లో మనుషుల పర్సులు దొంగిలించాలంటే
వాళ్ళు వెళ్ళే దారిలో కోట్ల రూపాయల డబ్బుల కట్టలు
ఎన్ని ఎరవేసినా ఫలితం ఉండదు!
కానీ లక్ష్మీపార్ ఒక ఆర్టికల్ కాగితాన్నో... శీనయ్యసార్ పుస్తకాన్నో
పడేస్తే మాత్రం చాలా తేలికగా పని అవుతుంది!
పెద్దపెద్ద ప్రాజెక్టులు నిర్మిస్తే
చిన్నచిన్న వాగులు కనుమరుగైపోతాయేమో కానీ..
పెద్ద పెద్ద గ్రూపు ఉద్యోగుల కోసం
చిన్నప్పటి చదువులు కనుచూపుగై ఇక్కడ
మనుషులు దేదీప్యమానం అవుతాయి!
ఎన్నో కొండల్ని నిండిన
రామప్పగుడి, చెరువుల ఉత్సవాలు జరపాలంటే
స్పందించని వాళ్ళని...
కృష్ణదేవరాయల పట్టాభిషేక ఉత్సవాలని జరిపించే వాళ్ళని...
ఇక్కడి శపోరకుర్సీల మధ్య రెండు నిమిషాలు నిలబెట్టైన చాలు...
మన దేశచరిత్ర అంటే మనచరిత్రే కదా అనుకుంటూ
ఉత్సవాల మనస్సులతో ఉత్తేజితులై సంబరాలు
నిరంతరం జరుపుతారు!
వానకు నుడికి సాహితీ గౌరవాన్ని తెచ్చిన గురజాడలలా...
వాడుక పలుకులతో ఉద్యోగసమరాన్ని గెలిపిస్తున్న
ఇక్కడి గురువుల వాదల్లో
తెలుగు వెలుగుల 'ట్యాంకుబండు' నీడల క్రీడ
తెలుగులోనే మొత్తం విశ్వాన్నంతా బోధించనపడుతున్న
లేతమొక్కలు మద్రిమానులై ఎదిగే తమ ఉనికిని
గ్రూపు ఒకటి, రెండు పరీక్షల్లో
ప్రథములై విజయపతాకాన్ని ఎగురవేస్తారు!
కృత్రిమ ఉపిరి తగిలించుకునో...
అక్సిజన్ అవసరమే లేకుండాగానే...
ఒకరో ఇద్దరో హిమాలయాల్ని ఎక్కి చరిత్ర సృష్టించి
ఉండవచ్చు కానీ...
అసలు ఊపిరే తీసుకోవడం మర్చిపోయి
నిద్రాహారాల అవసరం లేకుండానే..
వందలు వేల మంది ఆశయాల కోసం
ఇక్కడి చరిత్ర చదువుతుంటారు!
హాస్టల్ బాత్‌రూముల దగ్గర
తెల్లవారుఝాము నుంచే లైనులో నుంచున్న వాళ్ళు...
చిన్నప్పుడు బడికి పంపే కుండు
తలంటుస్నానం చేయించి, ఉతికిన బట్టలువేసి
పుస్తకాల సంచీ సర్ది, భోజనం బాక్సు పెట్టిన
అమ్మరూపాన్ని
తనివితీరా తలుచుకుని
కృతజ్ఞులై
కాసేపు నుంచున్న 'కాస్త' చోటులోనే
సాష్టాంగదండ ప్రణామం చేస్తారు!
ఇక్కడ
తరగతి గదిలోకి వెళ్ళే తలుపు దగ్గర
మొదటిబెంచిలో సీటుకోసం తోసుకుంటున్న వాళ్ళు
చిన్నప్పుడు బడిలో పాఠాలు చదవక
మాస్టారికి భయపడి
వెనక బెంచీలో కూర్చున్న వాళ్ళే ఖచ్చితంగా అయి వుంటారు!
కొంతమంది కవులు...
చాలామంది తాత్వికులు...
పోయిన బాల్యం మళ్ళీ రాదని అని వున్నారు కానీ...
పోయిన "బాల్యపు చదువులు" మళ్ళీ కావాలంటే
ఒక్కసారి మన రాజధానికి రయ్యికరండి!
తప్పక మీ ఆశయసాధానికి 'జై' అని జండాలెగరేస్తారు!
తమ బాల్యపు గీతల్ని చైతన్యగీతాలుగా మార్చుకుంటూ
చదువుల తోటల్ని అక్షరాల రేడియం తమ్ములతో కాస్తున్న
ఇందిరాపార్కు చుట్టుప్రక్కల గోశిళ్ళన్నీ...
మన దేశపు 'ఇందిరా పాయింట్'లా మెరుస్తాయి
ఆశయాల పుష్పాల మధ్య
పరిమళరాగాలు పలికిస్తున్న
గీతా'కారక'చిలుకల సంగీతాలాపన విందాం!

# ఓడింది ఎవరైనా... గెలిచింది కాంగ్రెస్సే

## గల్పిక

అది హస్తినాపురం... టెన్‌జనపథ్‌లో సోనియాగాంధీతో పాటు మమతాబెనర్జీ, ములాయంసింగ్ యాదవ్, రాహుల్‌గాంధీ, ప్రణబ్ ముఖర్జీ, ఏ.కె.ఆంటోని, చిదంబరం, అహ్మద్ పటేల్ వంటి నాయకులు సమావేశమైవున్నారు. సోనియా వుండి... మమతాజీ... ప్రణబ్‌జీని రాష్ట్రపతిని చేయాలనుకుంటున్నాం. అందుకు మీ మద్దతుకావాలని అడిగింది. దానికి మమత వుండి... రాష్ట్రపతి అంటే రబ్బర్‌స్టాంపులా వుండాలి... ఏమి వంచితే అటు వంగే గుణం వుండాలి. దీనికి మన్మోహన్‌సింగ్ కరెక్ట్. ఈ విషయంలో అది నిరూపించబడింది కూడా... కాబట్టి ఆయన్ని రాష్ట్రపతిని చేద్దాం అని ప్రతిపాదించింది. దానికి సోనియా... మమతా, నువ్వు నా బాధను అర్థంచేసుకో, ఇంట్లో పెద్ద కొడుకును పక్కనపెట్టి ఎవరైనా రెండో కొడుక్కి పెళ్లి చేస్తారా... కేవల రాహుల్ బాబును ప్రధానిని చేయాలంటే, పార్టీలో సీనియర్‌గా వున్న ప్రణబ్‌ముఖర్జీని రాష్ట్రపతిని చెయ్యాలి. అందుకు మీరు సపోర్ట్ చేయాలి... అని కోరింది. అందుకు మమత... మీ బాధలు సరే... రేపు ఆయన రాష్ట్రపతి అయ్యాడంటే మా రాష్ట్రంలో ఏ చిన్న గొడవ జరిగినా నా మెడ మీదే కత్తిపెడతాడు. కాబట్టే నేను ఆయనకు మద్దతునివ్వలేకపోతున్నాను... అని ఖరాఖండీగా చెప్పేసింది. అక్కడే వుండి, అంతా వింటున్న దిగ్విజయ్‌సింగ్ కోపంతో లేచి... అనుకుంటే ఇప్పుడేకొవ్వా... నిన్నెవరు గెలిపించారు... నీ మద్దతు లేకుంటే మేం ప్రణబ్‌ముఖర్జీని గెలిపించుకోలేమా ఏంటి... అని విసురుగా మాట్లాడసాగాడు. సోనియా అడ్డొచ్చి, తెరుకుని... దిగ్విజయ్‌జీ... మీరు శాంతించండి అని కోరింది. ఎందుకు మేడమ్... ఎంత ఒకవేళ ఆంధ్రా ఎన్నికలలో మన పార్టీకి డిపాజిట్లు రాకపోతే మాత్రం ఈ మమతా బెనర్జీ మనల్ని అంత లీవ్‌గా చూడాలా? రాహుల్‌బాబు నియోజకవర్గంలో మన పార్టీకి ఒక్క అసెంబ్లీ సీటు రాకుంటే మాత్రం ఈమెకు మనం అంత లోకువయ్యామా... అని దిగ్విజయ్‌సింగ్ పేలసాగాడు. సోనియా వుండి... ఆమెలో అన్ని ఆలోచనలున్నాయా లేదో గానీ నీలో వున్న ఆలోచనలన్నీ బయటపెడుతున్నావ్... ఇక వాళ్లే కూర్చో అని గదిమింది. దిగ్విజయ్‌సింగ్ శాంతించి కూర్చున్నాడు. మమతా మాత్రం రాష్ట్రపతి అంటే రబ్బర్‌స్టాంపే... దానికి అన్ని విధాలా అర్హుడు మన్మోహన్‌సింగ్ ఆయనకే నా ఓటు అంటూ వాకౌట్‌చేసింది. అప్పుడు సోనియా... హమ్మయ్యా... మమతా బెనర్జీని పంపించేశాం.

ఈమె మనతోనే వుంటే కుండ్లో సలను, విషయాలో రాయి. చెవిలో జోరీగ మాదిరిగా మనల్ని సతాయిస్తుంటుంది. అని... ఏదో గుర్తుకు వచ్చినట్లు ఆఫ్టర్ ఆల్ పటేల్‌తో... ఆ ఆంధ్రా నాయకులను పిలిపించమన్నాను వచ్చారా అని అడిగింది. వెంటనే అహ్మద్‌పటేల్... వచ్చారు మేడమ్. వెళ్లారు. జామునే వచ్చి సిద్ధముఖాలేసుకుని బయటే నిలబడి వున్నారని చెప్పాడు. వాళ్లను లోపలకు రమ్మనండి అని సోనియా అంది. అహ్మద్‌పటేల్, వి.హెచ్.హనుమంతరావును వాళ్లను తీసుకురమ్మని పురమాయించాడు. తెలుగుదేశం నాయకుల తర్వాత ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ, మెగాస్టార్ చిరంజీవి, లగడపాటి, రాజగోపాల్, రేణుకా చౌదరి, డి.శ్రీనివాస్, పురంధరేశ్వరి, దామోదరం రాజనరసింహ, టి.సుబ్బరామిరెడ్డి వంటి నాయకులంతా వచ్చారు. అందరూ తలలు దించుకుని మౌనంగా వున్నారు. సోనియా వుండి... అంధ్రాలో ఏం చూసినా... వేదిస్తాం అని ప్రశ్నల వర్షం కురిపించింది. ముఖ్యమంత్రి నవ్వి ఆ జగన్ జైల్లో కూర్చుని చూసి కూడా... ఇప్పుడు మొత్తం 10 సీట్లు మన అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రాలేదు. అసలు మీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఏంటి అని ఆవేశంగా ప్రశ్నించింది. కిరణ్‌కుమార్‌రెడ్డి మెల్లగా తలపైకెత్తి... మా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎక్కడికీ పోలేదు మేడమ్. నాకు పోకే వేరు లెటెస్ట్‌గా వుందని ప్రజలు వైయస్సార్ కాంగ్రెస్‌కు మొగ్గుచూపారంతే అని చెప్పాడు. బొత్స సత్యనారాయణ వుండి... ఎన్నికలంటే ఇప్పుడు దఫ్యే కదా మేడమ్. మేమంతా ప్రెగ్రేతేనండి. మొదటిలు మేమేదో సిఎల బొలేదలయ్యేసట్లు జగన్ లక్షకోట్లు తిన్నాడని ఆరోపణలు చేసాం... జనాలు అది నమ్మారు... జగన్ వద్ద లక్షకోట్లు న్నాయి కాబట్టే అతని వెనకే వెళ్తే ఏదన్నా గిట్టుబాటువుతుందనుకున్నారు. అందుకే మనల్ని వదిలేసి జగన్ పార్టీకి ఓట్లేసారు అని చెప్పాడు. చిరంజీవి... మెగాస్టార్ పెద్ద స్టైల్లో... నా ఆక్టింగ్‌తో మేం సీట్లు గెలవచ్చనుకున్నా. ఆఖరకు నన్ను చూసి కూడా ఓట్లు రాకపోయిందని అనే సోనియా ఆవేదనతో అడిగింది. దానికి చిరంజీవి... ఏదేవారు మేడమ్ మీరు... నాకు అంత సీన్ వుందంటే నా పార్టీని మూసేసుకుని మీ పార్టీలోకెందుకొస్తాను. మీకేనో పెద్ద సీన్ వుందనుకుని నేనొస్తే, ఆఖరకు మీ సీన్ సితారా అయిపోయింది... ఇక నాకు భవిష్యత్ ఏంటి దేవుడా అని వాపోసాగాడు. ఫైర్‌బ్రాండ్ రేణుకా చౌదరి వుండి... జగన్ మీద మేం దాడి చేసాం.

జనాలు కూడా ఆ దాడే వేస్తారనుకుంటే ఓట్లేసారు. ఆయనకున్న దొంతెనే, అయ్యిందేదో, ఉదగనూ చేరం తిట్టికొట్టే ఆయనకు ఉమేష్ పెరుగుతుంది. కాబట్టి ఇక ట్రెండ్‌ను మార్చి ఆయనను పొగడాలనుకుంటున్నాం. ఆ విధంగానైనా ఆయన పావు లాలీటిని తగ్గించవచ్చని చెప్పింది. టి.సుబ్బరామిరెడ్డి వుండి... మేడమ్ అసలు విశ్వంతా మనవాళ్లదే! ప్రజాలంతి పచ్చిన ప్రతిఒక్కరూ జగన్ అవినీతిపరుడంటూ ఆయన జపం చేసారు తప్పితే కాంగ్రెస్ చేసిన మంచిపనుల గురించి ఒక్కరూ చెప్పిన పాపానపోలేదు. జగన్ నామ జపం మరచాలనుకున్నా మన నాయకులు మరచిపోలేదు. అదే మన కొంప ముంచిందని చెప్పాడు.

అంతలో చెవుడుండి... అసలు మన పార్టీ ఓడిపోయిందని ఎందుకనుకుంటున్నారు మేడమ్. ఇదే ప్రశ్న విసిరింది. దాంతో అందరూ ఉలిక్కిపడి వెనక్కి చూసారు. అక్కడ ఖూస్తీ నల్ల షర్ట్, నల్లప్యాంటు, నల్లటోపీ, నల్లబూట్లు వేసుకుని స్టైల్ ఆఫ్ సెంట్రల్ ఆఫీసర్ కాపాడుతున్న రెడ్డి(62+) వున్నాడు. ఆయన్ని చూసి సోనియా... బ్లాక్‌కమెండోలకు ఇక్కడేంపని... పోయి బయట వుండు అని కసిరింది. అప్పుడు భోస్ర వుండి... ఆయన బ్లాక్‌కమెండో కాదు. బ్లాక్‌మేడో కాదు. మన పార్టీ ఎమ్మెల్యేనే... అని ఆతనిని పరిచయం చేసాడు. అప్పుడు సోనియా... ఏమైనా మన పార్టీకి డిపాజిట్లు రాలేదంటే, మనం మన పార్టీ ఓడిపోయిందంటాంటోంటే... బ్లాక్ ఆటో వాలా అని అడిగింది. అప్పుడు వెనక... అసలు జగన్ ఎవరు మేడమ్... మన కాంగ్రెస్ రక్తం పంచుకు పుట్టినోడు. కాబట్టి తన పార్టీకి కూడా కాంగ్రెస్ పేరే పెట్టుకున్నాడు. పశ్చిమబెంగాల్‌లో మన నుండి విడిపోయిన మమతాబెనర్జీ గారి, తృణమూల్ కాంగ్రెస్‌లో మమతాబెనర్జీ గారి, మహారాష్ట్రలో శరద్‌పవార్ గారి కాంగ్రెస్ అనే పేరుతోనే పార్టీలు పెట్టిన వాళ్లే, వాళ్లంతా తిరిగి మనతోనే వున్నారు. రేపు జగన్ కూడా అంతే. మన మీద కోపంతో మన నెత్తి బయటకెళ్లి మనకోసం తిరుగుతున్నాడనుకుంటారా... సరిలేఖ అంటారా? జగన్ ఎవరనుకుంటారు? ఇచ్చినవాళ్లు సమత తేవలసింది. కాబట్టి ఇప్పుడు జగన్ గెలుపునూ మన గెలుపుగా భావించుకుంటే మనం ఓడిపోయామనే ఫీలింగే వుండదని అని చెప్పాడు. ఆ మాటలు అందరూ... అవును కరెక్టే... ఏ కాంగ్రెస్ అయితేనేం... గెలిచింది కాంగ్రెస్ పేరున్న పార్టీయే కదా అని సర్దిచెప్పుకున్నారు.

* * * * *

## గూడూరు డివిజన్ వార్తలు


### కూలేందుకు సిద్ధంగా రిజర్వాయర్

గూడూరు పురపాలకసంఘ పరిధిలోని రెండో పట్టణంలోని స్వర్ణభారతి నగర్‌లో పిర్మాటుచేసి వున్న రిజర్వాయర్ శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ ప్రాంతంలో అర్బన్ హెల్త్ సెంటర్‌తో పాటు పలునివాస గృహాలున్నాయి. దీనిపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించకపోవడంతో నిరుపయోగంగా మారింది. స్వర్ణభారతినగర్‌లోని ప్రజలకు ఈ రిజర్వాయర్ ద్వారా తాగునీటి సరఫరా జరుగుతుండేది. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడిపోవడంతో ఏ క్షణం కూలుతుందోనని ప్రజలు అనుక్షణం భయాందోళనల మధ్య కాలక్షేపం చేస్తున్నారు.

### బియ్యం స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

ఇటీవల గూడూరు కోనేటిమిట్ట ప్రాంతంలో గూడూరు డివిజన్ కె.సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకొన్న తమిళనాడు రేషన్ బియ్యాన్ని గూడూరు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని వాటిని రేషన్‌షాపుకు తరలించారు. సివిల్‌సప్లై డి.టి.వెంకటేశ్వర్లురెడ్డి తన సిబ్బందితో పోలీసులు పట్టుకున్న రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితునిపై కేసునమోదు చేశారు.

### బాధితులకు ఎమ్మెల్యే చేయూత




ఈనెల 18వతేదీ జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాన్ని 18వతేదీ స్థానిక ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్ రావు వరామర్శించి ఆ కుటుంబానికి రేవేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. స్థానిక ఆరుంధతీయవాడలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా చేవూరి సుబ్బారావు అనే వ్యక్తి పూరిల్లు కాలిపోయింది. ఈ సంఘటనలో పిల్లల చదువుల కోసం దాచుకొనివచ్చిన నగదు, బంగారం కాలిపోవడంతో కుటుంబసభ్యులు కట్టు బట్టలతో నిలిచారు. బల్లి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో చిన్న పూరిళ్ళ స్థలంలో పక్కాగృహాల నిర్మాణంకోసం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు, వారు దరిత ఇందిరా అవాసయోజన పథకం కింద పక్కాగృహాలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట టిడిపి నాయకులు శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, చిల్లు వెంకురామయ్య, పుట్టంపల్లి వెంకటేశ్వర్లు, పాముంజి ధర్మయ్య తదితరులున్నారు.

PDF Compressor Free Version



## మేషం



అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము

వ్యాపార భాగస్వామ్య అవకాశాలు, పెట్టుబడి అవకాశాలు లభిస్తాయి మరియు వ్యాపారవర్గాలకు ఆదాయం బాగుంటుంది. యజమానులకు పనివాళ్లతో ఇబ్బందులుంటాయి. శుభకార్యాలు విందులలో పాల్గొంటారు. ఆర్థిక ఇబ్బందులను సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటారు. వృత్తి ఉద్యోగాలలో పనితీవ్రత బాగుంటుంది. ఆదాయం కూడా బాగుంటుంది. షేర్లు స్వల్పంగా లాభిస్తాయి.

## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

పెట్టుబడుల మీద లాభాలుంటాయి. రాబోవు అవసరాలకు ముందుగా వనరులు సమకూర్చుకొనే ప్రయత్నాలుంటాయి. ఉద్యోగులకు బాధ్యతలు పెరిగి అధికారవర్గ అభిమానాన్ని చూరగొంటారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. క్రొత్త పెట్టుబడి అవకాశాలు, క్రొత్త వ్యాపార ప్రారంభాలు జరుగవచ్చు. ఎదుటి వారిని ఒప్పించి మెప్పించగల శక్తి సామర్థ్యాలుంటాయి.


## మిధునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థిక, లౌకిక వ్యవహారాలలో బంధువులు సన్నిహితులు పేచీ పెట్టవచ్చును. వ్యాపార, పారిశ్రామిక, ఉద్యోగవర్గాలకు అధికార యంత్రాంగము వల్ల సమస్యలు కలుగగలవు. గృహమార్పులు, వస్తువాహన రిపేర్లుండగలవు. వృత్తి వ్యాపారవృద్ధి అవకాశాలకు, ప్రయత్నాలకు ఆటంకాలు పోటీ ఉంటుంది. ఆశించిన ఆదాయం ఉండదు. ఖర్చులు బాగా పెరుగుతాయి.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్థిక వ్యవహారాలలో కుటుంబ వ్యవహారాలలో దృఢనిశ్చయాలు జరుగుతాయి. షేర్ల మీద లాభాలు, బంధుమిత్రులకు ఏదో ఒక రూపంలో సహాయంచేస్తారు. వృత్తి వ్యాపారాలలో కొంతమేరైన మార్పులుండి ఆదాయం పెరుగుతుంది. డిపాజిట్లు చేయడం, క్రొత్త వ్యాపారాలలో పెట్టుబడి పెట్టడం వంటి అవకాశాలు దొరుకుతాయి. న్యాయ వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

గృహోపకరణాలు, పరికరాలు యంత్రాలు కొనడం, పెట్టుబడులమీద లాభాలు, తలపెట్టిన పనులకు వనరులు, బ్యాంకు ఋణాలు పొందడం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఇబ్బందులను అధిగమించి అభివృద్ధి వైపు సాగుతారు. ఆదాయం సంతృప్తికరం. కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. హామీలు మధ్యవర్తిత్వాల విషయంలో తొందర పడవద్దు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

బంధుమిత్రులను కలుసుకొనడం, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. ఉద్యోగవర్గాలకు అధికారిక అదనపు బాధ్యతలు పైనబడగలవు. కుటుంబ, ఆర్థిక సమస్యలు పరిష్కారానికి వస్తాయి. వృత్తి వ్యాపారరంగాలలో పెరుగుదల ఆదాయవృద్ధి ఉంటుంది. కొన్ని నిర్ణయాల విషయంలో ఇతరులు మిమ్మల్ని తప్పుదారి పట్టించే అవకాశము ఉన్నది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది 22.06.2012 నుండి
తేది. 28.06.2012 వరకు.

ఈవారంలో శుక్రగురుకేతువులు, మిధునంలోరవి, కర్కాటకంలోబుధుడు, కర్కాటకంలో సింహకన్యతులారాశులో చంద్రుడు, కన్యలో శనికుజులు, వృశ్చికంలో రాహువు సంచారము.

**పంచాంగము:**


**ముహూర్తములు :**

ముహూర్తములు లేవు.

**ఆషాఢమాస శుక్లపక్షతిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 22 | శుక్ర | తదియ | రా॥గం.10.01వ॥ |
| తేది. 23 | శని | చతుర్థి | రా॥గం.9.50వ॥ |
| తేది. 24 | ఆది | పంచమి | రా॥గం.9.13వ॥ |
| తేది. 25 | సోమ | షష్ఠి | రా॥గం.8.07వ॥ |
| తేది. 26 | మంగళ | సప్తమి | రా॥గం.6.38వ॥ |
| తేది. 27 | బుధ | అష్టమి | సా॥గం.4.47వ॥ |
| తేది. 28 | గురు | నవమి | సా॥గం.2.40వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అనుకోని అదనపు ఖర్చులుంటాయి. వచ్చే ఆదాయంపై అసంతృప్తి ఉంటుంది. యజమానులకు వర్కర్లతో పేచీలుంటాయి. అనవసర విషయాలకు దూరంగా ఉండండి. పెద్ద చెల్లింపు హామీల విషయంలో పునరాలోచన చేయండి. చేపట్టిన పనులకు ఇబ్బందులు ఏర్పడగలవు. వృత్తి వ్యాపారరంగాలలో మంచి అవకాశాలు లభించగలవు. వ్యాపారవర్గాలలో పోటీ వల్ల మీరు నష్టపడవచ్చును.


## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనుకున్న పనులు అతిగా టెన్షన్‌పెడుతాయి. ఉద్యోగులు అధికారులు ఎంత కష్టపడినా పై అధికారులను సంతృప్తిపరచలేరు. అనవసర ఖర్చులు, తప్పనిసరి చెల్లింపుల వల్ల మీ అభివృద్ధికి ఆటంకముకాగలదు. అయితే ఆదాయము సంతృప్తికరంగా ఉంటుంది. శుభకార్యాలలో పాల్గొంటారు. షేర్లు కొద్ది లాభాలతో ఉంటాయి. ఉన్నత విద్యావకాశాలు విద్యార్థులకు ఉంటాయి.


## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆత్మీయులకు బంధువర్గానికి అనారోగ్య బాధలుంటాయి. కుటుంబఖర్చులు, పలుకుబడికై ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. పెట్టుబడిరంగాలు, షేర్లలో ఆశించిన లాభాలుండవు. చేపట్టిన పని సక్రమంగా జరుగుతాయి. వృత్తిపరంగా అవకాశాలు ఆదాయం తృప్తికరం. వ్యాపారవర్గాలకు పోటీదారుల వల్ల అవకాశాలు తప్పిపోవచ్చును మరియు ఆదాయం సామాన్యం.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వాహనాలు నడిపేవారు, యంత్రాలతో కరెంటు పనులతో ఉండేవారు మెలకువగా ఉండాలి. షేర్లు పెట్టుబడుల మీద లాభాలు తగ్గిపోతాయి. ఆర్థిక అంచనాలలో వ్యత్యాసాలుండి ఆదాయంకంటే ఖర్చులు అదనంగా ఉంటాయి. అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. ఆర్థిక లావాదేవీలందు పేచీలురావచ్చును. సన్నిహితుల కామెంట్స్ కొంత బాధిస్తాయి.


## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వ్యాపారవృద్ధికి క్రొత్త ప్రణాళికలను ఆలోచిస్తారు. వ్యాపారవర్గాలకు పరిశ్రమల నిర్వాహకులకు ఆదాయం బాగుంటుంది. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది మరియు తమపై అధికారులతో సఖ్యత బాగుంటుంది. విలువైన వస్తువులు, గృహోపకరణాలు సమకూర్చుకొంటారు. వృత్తిపరంగా పనితీవ్రత ఉండి ఆదాయం పెరుగుతుంది. రావలసిన బాకీలు, బ్యాంక్ ఋణాలు లభిస్తాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కుటుంబ సభ్యులందొకరికి అనారోగ్య బాధలుంటాయి. గృహమార్పులు, క్రొత్త వస్తువులను ఇంటికి సమకూర్చుకొనడం జరుగుతుంది. ఒక నిర్దిష్ట పద్ధతి ప్రణాళిక ద్వారా చేపట్టిన పనులను నెరవేర్చుకొంటారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. ఇతర కారణాలు, అవసరాల రీత్యా ఋణాలు పొందుతారు. దూరప్రయాణాలుంటాయి.

# అంబేద్కర్ విగ్రహావిష్కరణ

కలువాయి బస్టాండ్ ప్రాంగణంలో భారతసంవిధాన్ (రాజ్యాంగ) నిర్మాతల మండలి అధ్యక్షుడు డా॥బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏడిపియస్ జాతీయ వ్యవస్థాపకులు ఇంగిలాల రామచంద్రరావు 17వ తేదీన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశించిన ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే కుల సమాజాన్ని రూపుమాపాలన్నారు. డా॥అంబేద్కర్ గౌతమబుద్ధుని, కబీరును, మహాత్మాపూలేలను తన గురువులుగా భావించారన్నారు. అంబేద్కర్ ఆశయాల గురించి విద్యావంతులు తమ బిడ్డలకు తెలియజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏడిపియస్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మండలశాఖాధ్యక్షుడు శ్రీనివాసులు, డా॥ఓబులరాజు, డా॥చంద్రహాస్, వెనుకబడిన తరగతుల నాయకులు మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

# ముటకుల పోలేరమ్మకు పొంగళ్లు

ముత్తుకూరు మండల పరిధిలోని కృష్ణాపట్నంలో వెలసి వున్న పోలేరమ్మ ఆలయంలో 17వ తేదీ అంగరంగవైభవంగా పొంగళ్ల కార్యక్రమం జరిగింది. వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. చుట్టుప్రక్కల గ్రామాల నుండి వచ్చిన భక్తులు పిండినైవేద్యాలు, అంబలితో పాటు పొంగళ్లు మ్రొక్కుబడులుగా చెల్లించుకున్నారు. కృష్ణపట్న గ్రామంలో వెలసివున్న ఈ తల్లిని భక్తిశ్రద్ధలతో పూజించుకున్నారు.

# నిత్యన్నదానానికి లక్షరూపాయలు

నెల్లూరు జిల్లా, సూళ్లూరుపేటలో వెలసివున్న శ్రీ చెంగాళమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి మంచి స్పందన వస్తోంది. తాజాగా హైదరాబాదుకు చెందిన డా॥సురేంద్రనాథ్‌రెడ్డి నిత్య అన్నదాన పథకానికిగాను 17వ తేదీ లక్ష రూపాయలు ఆర్థికసాయం అందజేశారు. ఆలయచైర్మెన్ ఐసనాక హర్షవర్ధన్‌రెడ్డి, కార్యనిర్వాహణాధికారి పోరెడ్డి శ్రీనివాసరెడ్డిలకు సురేంద్ర ఆయన భార్య గీతలు మొత్తాన్ని అందజేశారు. చెంగాళమ్మ పరమేశ్వరి మీద తమకున్న భక్తితో నిత్యాన్నదానానికి మొత్తాన్ని అందజేస్తున్నామని డాక్టర్ దంపతులు తెలిపారు.

# రేషన్‌షాపులపై దాడి

రేషన్ కిరోసిన్ పంపిణీలో అవకతవకలు చోటుచేసుకోవటం, రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించకపోవటంలు తమ దృష్టికి వచ్చినందువల్లనే రేషన్‌షాపులపై దాడులు నిర్వహించటం జరిగిందన్నారు పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దారు రంగయ్య.

18వ తేదీ నెల్లూరు కపాడిపాళెం రేషన్‌షాప్ డీలర్ జానా ప్రకాష్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. సరుకును సీజ్ చేశారు. దాడుల్లో ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ సుకుమార్, పౌరసరఫరాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇలాంటి దాడులు ఎన్ని జరుగుతున్నా రేషన్‌షాపులవారు మాత్రం చేతివాటం చూపిస్తూనే వున్నారనేది జన వ్యాఖ్య!

# నిర్వాసితుల నిరాహారదీక్షలు

తమకు సరైన వైద్యసదుపాయాలు కనీసంగానైనా కలుగజేయాలని కోరుతూ కృష్ణపట్నంపోర్టు నిర్వాసిత పోరాట కమిటీ ఆధ్వర్యంలో 45రోజులుగా రిలే నిరాహార దీక్షలు జరుగుతున్నాయి. ఇంత దీర్ఘకాలిక పోరాటం జరుపుతున్నా వీరిని పట్టించుకున్న నాథుడే లేకుండాపోవటం విచారకరం. పారిశ్రామికంగా బహుముఖంగా అభివృద్ధి చెందుతున్న కృష్ణాపట్నంపోర్టు నిర్వాసితులకు కనీస వైద్యసదుపాయాలు కలుగజేసేందుకు పోర్టు యాజమాన్యం ముందుకురావాలని కోరుతున్నారు.

కాకులరుస్తుంటాయ్... కరవాడ్ ఎండుతుంటుంది... అన్న సామెతగా నిర్వాసితుల పోరాటం జరుగుతూనే వుంటుంది. పోర్టు యాజమాన్యం కదిలిరాదు.




# వధువు కావలెను — పెళ్లి సంబంధాలు — వరుడు కావలెను



1. 1986 జనవరి 11 జననం. ఎత్తు 5'9". చదువు బి.టెక్(మెకానికల్), యంయంయం (కెనడా). ఉద్యోగం సాఫ్ట్‌వేర్ డెవలపర్ (ఇన్‌ఫోసిస్ టెక్నాలజీస్ లిమిటెడ్, మైసూరు (2సం॥)). ప్రస్తుతం సప్లై చైన్ అనలిస్ట్ రీసర్చ్ ఇన్‌మోషన్ - బెహ్రైన్. జీతం 65కె. ఆస్తి వాటా 2కోట్లు (జాయింట్ ప్రాపర్టి 5కోట్లు భాగం). ఉన్నతమైన రెడ్డి ఉద్యోగ కుటుంబం. స్వస్థలం నెల్లూరు జిల్లా.
2. 1985 ఆగష్టు 6 జననం. ఎత్తు 5'8". చదువు బి.ఇ.యం.యస్(న్యూయార్క్) అమెరికా. ఉద్యోగం బోస్టన్ (అమెరికా). జీతం 80కె. ఉన్నతమైన ఉద్యోగ కుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా. ఆస్థివాటా 4కోట్లు.
3. 1980 ఫిబ్రవరి 24 జననం. ఎత్తు 5'6". చదువు బి.టెక్(కంప్యూటర్స్), యం.టెక్(ఆస్ట్రేలియా). ఉద్యోగం టెక్‌రైటర్ (ఆస్ట్రేలియా). జీతం రూ.1,50,000/- నెలకు. ఆస్తి వాటా 1కోటి. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. స్వస్థలం మద్రాసు. తల్లి స్వస్థలం నెల్లూరుజిల్లా.
4. 1980 నవంబరు 7 జననం. ఎత్తు 5'10". చదువు బి.టెక్. (ఇ.ఇ.ఇ). ఉద్యోగం రాయల్ బ్యాంకు ఆఫ్ స్కాట్‌లాండ్(లండన్). జీతం నెలకు 5లక్షలు. ఉన్నతమైన మధ్యతరగతి రెడ్డి ఉద్యోగ కుటుంబం. ఆస్తి విలువ 2కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా.
5. 1980 మే3 జననం. ఎత్తు 5'10". చదువు యం.బి.ఏ., సి.ఏ. ఉద్యోగం హైదరాబాద్. జీతం నెలకు రూ.60,000/-. ఆస్థి విలువ 4కోట్లు. స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా. ఉన్నతమైన రెడ్డి వ్యవసాయ కుటుంబం.
6. 1985 ఏప్రిల్ 30 జననం. ఎత్తు 5'6". చదువు బి.టెక్ (సి.బి.ఐ.టి), యం.యస్(కాలిఫోర్నియా) అమెరికా. ఉద్యోగం బిజినెస్ అనలిస్ట్ - సిమివాలీ (కాలిఫోర్నియా) ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. స్వస్థలం వరంగల్ జిల్లా. ప్రస్తుత నివాసం హైదరాబాద్. ఆస్థి విలువ 15కోట్లు.
7. 1990 జులై 4 జననం. ఎత్తు 5'3 1/2". చదువు బి.టెక్.(ఇ.ఇ.ఇ). ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. ఆస్థి విలువ 15కోట్లు. ప్రస్తుత నివాసం హైదరాబాద్. స్వస్థలం నెల్లూరుజిల్లా.
8. 1985 మార్చి 1 జననం. ఎత్తు 5'3". చదువు బి.టెక్(కంప్యూటర్స్). ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. ఆస్తి విలువ 5కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా.
9. 1985 డిసెంబరు 23 జననం. ఎత్తు 5'8". చదువు యం.బి.బి.యస్(చెన్నై), యం.డి (రెండవ సంవత్సరం) ఉన్నతమైన రెడ్డి ఉద్యోగ కుటుంబం. స్వస్థలం చిత్తూరుజిల్లా ఆస్థి విలువ 2కోట్లు.
10. 1985 సెప్టెంబరు 1 జననం. ఎత్తు 5'3". చదువు బిటెక్(జె.యన్.టి.యు), యం.యస్(ఫ్లోరిడా) అమెరికా. ఉద్యోగం రాక్‌వెల్ ఏరోస్పేస్ సిస్టమ్స్ - అయోవా. జీతం సం॥కు 65కె. ఆస్తి విలువ 80లక్షలు. స్వస్థలం నెల్లూరుజిల్లా. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413, పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.
98480 34522
94406 39460.
పోస్ట్‌బాక్స్ నెం.4, C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక, ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

PDF Compressor Free Version



# చంద్రుడి ముందు చీకట్లు!



**ఏ నాయకుడికైనా భవిష్యత్ మీద ఆశలు సజీవంగా వుంటేనే రాజకీయాలలో ముందుకు పోవాలనే ఆసక్తి వుంటుంది. రక్తం రుచిమరిగిన పులికి, అధికారాన్ని అనుభవించిన రాజకీయ నాయకునికి మధ్య పెద్ద తేడా వుండదు. అధికారం కోసం, పదవుల కోసం నాయకులు ఎంతకైనా తెగిస్తుంటారు. ఎంతదాకానైనా దిగజారుతుంటారు కూడా!**

పదేళ్లపాటు అధికారాన్ని అనుభవించి ఒక్కసారిగా మరో పదేళ్లు అధికారానికి దూరమైతే ఆ నాయకుడు పడే బాధలు ఎలా వుంటాయో ఇప్పటి పరిస్థితుల్లో తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడిని చూసి అర్థం చేసుకోవచ్చు.

విజన్ 20-20 కాన్సెప్ట్‌తో తాను సీఎంగా వున్నప్పుడు ముందుకెళ్లిన చంద్రబాబుకు ఇప్పుడు భవిష్యత్తంతా కూడా గాఢాంధకారంగా కనిపిస్తుంది. 2020దాకా తానే అధికారంలో వుంటానని ఆయన కలలు కన్నాడు. అయితే ఆ కలలను సాకారం చేసుకునే రీతిలో పరిపాలన చేయలేదు. చంద్రబాబును చాలామంది మేధావి అంటారు గాని, ఒకరకంగా చూస్తే అమాయకుడు. దేశంలోని చాలా రాష్ట్రాలలో ప్రాంతీయపార్టీల ముఖ్యమంత్రులు ఒక్కసారి అధికారంలోకి వస్తే తిరిగి కుర్చీని వదలడం లేదు. ప్రజల నాడిని పసిగట్టేసి, ప్రజల అవసరాలను ఒడిసి పట్టేసి వారి ఆలోచనలకు అనుగుణంగా పరిపాలిస్తూ ఆయా రాష్ట్రాలలో తమ అధికారాన్ని సుస్థిరం చేసుకుంటూ, ఫెవికాల్‌తో అతికించినట్లు సీఎం కుర్చీలకు అతుక్కుపోతున్నారు. కానీ 2002-03 ప్రాంతంలో చంద్రబాబు మాత్రం రాష్ట్ర ప్రజల బాధలను పట్టించుకోకుండా, కంప్యూటర్ మాయలో పడి కరెంట్ ఛార్జీలను పెంచేసి, రైతుల సమస్యలను గాలికొదిలేసి నియంతృత్వపు చేష్టలతో, నికృష్టపు పోకడలతో 2004లో చేజేతులా చేతి పార్టీకి అధికారాన్ని అందించాడు.

ఆరోజు ఆయన చేజార్చుకున్న అధికారం ఈరోజు తిరిగి ఆయన చేతికి అందడం కష్టతరంగా మారింది. 2004, 2009లలో చంద్రబాబు అధికారకాంక్షకు వై.యస్. గండి కొడితే, ఇప్పుడు ఆయన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి ఆ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాడు.

వాస్తవ పరిస్థితుల్లో అయితే రెండు గట్టి పార్టీలున్న చోట ఒక పార్టీ మీద ప్రజల్లో వ్యతిరేకత వస్తే ఇంకో పార్టీకి అధికారాన్ని కట్టబెడుతుంటారు. తమిళనాడులో జరుగుతున్నదిదే! జగన్ కాంగ్రెస్‌లో వుండుంటే మన రాష్ట్రంలో కూడా పరిస్థితి వేరుగా వుండేది. కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజల్లో వచ్చిన వ్యతిరేకత ప్రతిపక్ష తెలుగుదేశంకు అనుకూలంగా మారేది. కాంగ్రెస్ నాయకుడిగా జగన్ వచ్చి ప్రచారం చేసినా కాంగ్రెస్ మీదున్న వ్యతిరేకత తగ్గేది కాదు.

కాని కాంగ్రెస్ నుండి జగన్ తెలివిగా బయటకొచ్చేసాడు. కాంగ్రెస్‌కు తానే ప్రత్యామ్నాయ వేదికను ఏర్పాటు చేసాడు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించే వారంతా ఇప్పుడు జగన్ వైపు వస్తున్నారు. వాస్తవంగా చూస్తే ప్రస్తుత ప్రభుత్వ వ్యతిరేకతను ప్రధాన ప్రతిపక్షంగా తెలుగుదేశం సొమ్ము చేసుకోవాలి. కాని చంద్రబాబును జనం 9ఏళ్లు సీఎంగా చూసారు. ఆయన జనం నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోయారు. ఇప్పుడు అటు కాంగ్రెస్‌ను ఇటు చంద్రబాబును జనాలు నమ్మడం లేదు. వీరికి ప్రత్యామ్నాయంగా వున్న జగన్‌నే నమ్ముతున్నారు. కోట్లాది రూపాయలు అక్రమఆస్తులు సంపాదించారని రాష్ట్రంలోని మిగిలిన అన్ని రాజకీయ పార్టీల నేతలు జగన్‌పై దుమ్మెత్తి పోస్తున్నా, ప్రజలు దానిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. బురదగుంటలో వుంటూ మురికి అంటని పంది, రాజకీయాలలో వుంటూ అవినీతి సంపాదన లేని నాయకులు ఎవరన్నా వుంటే చూపించండంటూ ప్రశ్నిస్తున్నారు. జగన్‌ను జనం ఎంతగా నమ్ముతున్నారనే దానికి నిన్నటి ఉపఎన్నికలలో వచ్చిన భారీమెజార్టీలే ఉదాహరణ. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ కనీసం రెండు సీట్లయినా గెలవగలిగింది. కాని తెలుగుదేశంకు ఒక్క సీటు లేదు. ఒక లోక్‌సభ స్థానంలో, ఐదు శాసనసభ స్థానాలలో డిపాజిట్లు లేవు. ఇంతకాలం ఆ పార్టీకి అండగా నిలిచిన బలహీన వర్గాలు, కమ్మ సామాజిక వర్గ ఓటు బ్యాంకులు సైతం చెల్లాచెదురైనట్లు ఈ ఫలితాలతో తేలింది. భవిష్యత్ ఇంత క్లియర్‌గా కనిపిస్తుంది. అధికారం కోసం చంద్రబాబు ఇంకెన్నేళ్లు ఎదురు చూపులు చూడాలో?

# ప్లాస్టిక్ భూతం

## పర్యావరణానికి శరాఘాతం



స్వయంకృతాపరాధం అంటే ఇదేనేమో. మనిషి తాను సృష్టించిన సౌకర్యాలు, సౌలభ్యాలు తన మనుగడకే ప్రశ్నార్థకాలుగా మారుతాయి. ఇప్పుడు సమాజంలో ఎటు చూసినా ప్లాస్టిక్, ప్లాస్టిక్. వినియోగంలోని ప్రతి వస్తువూ ప్లాస్టిక్‌దే. వినియోగించి, చెత్తలో వేసే ప్లాస్టిక్ సరంజామాతోనే ఇప్పుడు మనిషికి, ప్రకృతికి చిక్కొచ్చిపడింది. అది పర్యావరణాన్ని దెబ్బతీసే స్థాయికి ఎప్పుడో చేరిపోయింది. ప్లాస్టిక్ వినియోగాన్ని త్యజించాలంటే సాధ్యంకాని పరిస్థితికి మనిషి చేరాడు. ముఖ్యంగా చేసంచి బదులు ఉపయోగించే ప్లాస్టిక్ కవర్లు, టీ కప్పులు, మంచినీళ్ళ కప్పులు చెత్తలో కుప్పలు తెప్పలుగా చేరిపోయి పర్యావరణానికి ముప్పుగా పరిణమించాయి. వీధుల్లో చెత్తకుండీలను ఆశ్రయించే పశువులు ఆహారంతో పాటు వీటిని కూడా మింగేయడంతో, వాటి జీర్ణాశయాలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. మొన్న నరసింహకొండ దగ్గర సిద్ధ ఆశ్రమానికి ఓ రైతు దానం చేసిన ఆవు జ్వరంతో బాధపడుతుండడం జరిగింది. ఆశ్రమ నిర్వాహకులు ఆవును వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు దానికి శస్త్రచికిత్స చేస్తే జీర్ణాశయంలో 70కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడ్డాయి. వైద్యులతో పాటు అందరూ ఆశ్చర్యపోయి ఆందోళన వ్యక్తపరిచారు. ఈ విధంగా ప్లాస్టిక్ వినియోగం మనిషికి, జంతుజాలానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా పర్యావరణానికి ఎంత కీడు చేస్తుందో ఊహించడానికే ధైర్యం రావడంలేదు. అయినా ఈ సమస్య పట్ల మన ఉదాసీన వైఖరి మాత్రం మారదు. దీనిపై అటు ప్రభుత్వం, ఇటు ప్రజలు దృష్టి సారించి అత్యంత ప్రమాదకర పరిస్థితిగా పరిగణించి చర్యలు చేపడితేనే పరిష్కారం లభిస్తుంది. తూతూ మంత్రం తుమ్మాకు మంత్రంలాగా అధికారులు అప్పటికప్పుడు చర్యలు చేపట్టడం, సద్దుమణిగితే చేతులు దులుపుకోవడం చేస్తుంటే అది పెనుభూతమై మనందర్నీ కబళిస్తుంది. పారాహుషార్!

# కేడర్ కకావికలం...

(3వ పేజీ తరువాయి)

నియోజకవర్గంలో తెలుగుదేశంకు వచ్చిన ఓట్లు 8257. ఈ నియోజకవర్గంలో పార్టీ ఎంత హీనస్థితికి చేరిందనేదానికి ఈ ఓట్లే ఉదాహరణ. ఇక్కడ గట్టి నాయకులంతా పార్టీని వదిలివెళ్లారు. ఇటీవల కొమ్మి లక్ష్మయ్య కూడా తెలుగుదేశాన్ని వదిలి వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీకి ఈ దుర్గతి పట్టింది. నెల్లూరు నగరంలో 12300ఓట్లు, నెల్లూరు రూరల్‌లో 12138ఓట్లు... ఈ రెండు చోట్లా నాయకత్వం ఎంత అధ్వాన్నంగా వుందో ఈ ఓట్లే సూచిస్తున్నాయి. కోవూరులో మొన్న ఉపఎన్నికలలో 53వేల ఓట్లొస్తే, ఇప్పుడొచ్చింది 17వేలు. ఇంతలోనే ఎంతమార్పు. కందుకూరులో మాత్రం గౌరవప్రదమైన ఓట్లొచ్చాయి. కావలిలో బీద సోదరులు కొంత పరువు నిలుపుకునేలా ఓట్లు తెచ్చారు. ఇక అసెంబ్లీ ఎన్నికలున్నాయి కాబట్టి వాటితో పాటుగా లోక్‌సభలో తెలుగుదేశంకు ఉదయగిరిలో రెండోస్థానంలో ఓట్లు వచ్చాయి. ఓట్లపరంగా తెలుగుదేశం లోక్‌సభ అభ్యర్థి రెండోస్థానంలో నిలిచింది ఈ ఒక్క నియోజకవర్గంలోనే! నెల్లూరు రూరల్, నెల్లూరు నగరం, కోవూరు, ఆత్మకూరు... ఈ నాలుగుచోట్ల పార్టీ ఉనికి అన్నదే లేకుండాపోయింది. ఎంత వై.యస్. గాలి తోలినా తెలుగుదేశంపార్టీకి కనీస ఓట్ల శాతమన్నా కనిపిస్తుండేది. ఈ ఉపఎన్నికలలో అది కూడా కనిపించకుండా పోయింది.

# అక్రమ చొరబాట్లపై దృష్టి

**- కేంద్రమంత్రి పల్లంరాజు**

నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో ఈ నెల 18వ తేదీన కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రి పల్లంరాజు కోస్టుగార్డ్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో రక్షణశాఖకు 193వేల కోట్ల రూపాయలు కేటాయించాం. గతంలో ఆయుధాల కొనుగోళ్లకు విదేశాలపై ఆధారపడే వాళ్లం. ప్రస్తుతం ప్రభుత్వ ప్రైయివేట్ సంస్థలు సంయుక్తంగా ఆయుధాలు తయారుచేసేందుకు ప్రణాళికను తయారు చేస్తున్నాం. 2008లో ముంబాయిలో జరిగిన దాడులను దృష్టిలో వుంచుకొని 7500కిమీ విస్తరించి వున్న తీరప్రాంతంలో కోస్టుగార్డ్, మెరైన్ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నాం. కోస్తాదళాలకు ప్రస్తుతం 75నౌకలు, 50 ఎయిర్‌క్రాఫ్ట్ హెలికాప్టర్లు వున్నాయి. అదనంగా మరో 25నౌకలను కూడా ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదించటం జరిగింది. రక్షణ సంబంధించిన నౌకలు తయారుచేసే యార్డులు ఇప్పటికి నాలుగున్నాయి. అయినా మరిన్ని కొత్త నౌకా తయారీయార్డ్‌ల కోసం ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్నాం. తీరప్రాంతంలో నిరంతరం కోస్టల్ ఎక్సర్‌సైజెస్ జరుగుతూ వుంటాయి. అక్రమ చొరబాట్లు, సముద్ర కాలుష్యం ప్రకృతివైపరీత్యాల నుండి రక్షణ తదితర అంశాలపై కోస్టల్‌గార్డులు దృష్టి కేంద్రీకరిస్తారు. వీరు మెరైన్, పోలీసులతో పాటు ఎక్కడికక్కడ స్థానిక మత్స్యకారుల సహకారం కూడా తీసుకుంటుంటారన్నారు మంత్రి పల్లంరాజు.



కోస్టుగార్డ్ స్టేషన్ ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి పల్లంరాజు

## నిరంతర నిఘా

రాష్ట్రంలో 6 కోస్టుగార్డ్ నౌకలు, ఒక హెలికాప్టర్, ఒక భారీ నౌక నిరంతరం సముద్రజలాల్లో నిఘా నిర్వహిస్తున్నాయన్నారు కోస్టుగార్డ్ డీజీ మురళీధరన్. నూతనంగా ప్రారంభించిన కృష్ణపట్నం కోస్టుగార్డ్ స్టేషన్‌కు రెండు నౌకలు త్వరలో సమకూరుస్తున్నామని ఆయన వివరించారు. ఆ నౌకలు వచ్చే వరకు విశాఖపట్నం స్టేషన్‌కు సంబంధించిన "వజ్ర" "విగ్రహ" నౌకలు కృష్ణపట్నం వరకూ వచ్చిపోతూ కోస్టల్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తుంటాయని ఆయన వెల్లడించారు.

## కోస్టుగార్డ్స్ వందనం

కృష్ణపట్నంలో కోస్టుగార్డ్ స్టేషన్ ప్రారంభానికి ముందు కేంద్రమంత్రి పల్లంరాజు కోస్టుగార్డ్స్‌ల వందనం స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో ఐజీ సత్యప్రకాష్ శర్మ, జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్, కృష్ణపట్నం కోస్టుగార్డ్స్ కమాండెంట్ టీఆర్కేరావు, కృష్ణపట్నంపోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పల్లంరాజు తిరిగి హెలికాప్టర్‌లోనే బయలుదేరి వెళ్లారు.

# 'అప్స' వార్షికోత్సవం

ఈ నెల 19వ తేదీన నెల్లూరులోని 'అప్స' ఇంజనీర్స్ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దర్గామిట్టలోగల విశ్వభారతి అంధుల పాఠశాలలో అంధవిద్యార్థులకు పండ్లు, స్వీట్లు, బియ్యం పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో 'అప్స' ఇంజనీర్స్ అధినేత బి.ఎస్.రాజు, వైద్యఆరోగ్య సబ్‌యూనిట్ అధికారి ఎండ్లూరి విల్సన్, జిల్లా బాలికం సలహామండలిసభ్యులు ప్రమీద శ్రీనివాసులు, వై.రమణయ్యనాయుడు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఇదీ నా కథ - 54
(1924 - 2011)

# అమెరికా పర్యటన

అక్కడి నుండి 'వాక్స్ మ్యూజియం'కు వెళ్ళాం. అది లండన్ వెళ్ళిన ప్రతి వ్యక్తీ చూసి తీరవలసిన ప్రదర్శనశాల. మైనంతో రూపొందించిన ప్రపంచ ప్రముఖుల ప్రతి రూపాలు అక్కడ దర్శనమిస్తాయి. నిజానికవి ప్రతి రూపాలు కావు. ఆయా వ్యక్తుల వాస్తవ రూపాలను మన కళ్ళ ముందు నిలిపే అద్భుత శిల్పాలు. అందులో మన దేశ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ శిల్పం కూడా ఉంది. ఆ శిల్పాన్ని చూస్తున్నంత సేపు సాక్షాత్తూ ఇందిరాగాంధీని చూస్తున్న అనుభూతి నాలో కలిగింది.

తర్వాత మూర్తిగారికి వీడ్కోలు చెప్పి నేనూ సురేంద్ర 'బారన్స్‌టపుల్'కు వెళ్ళాం. ఆ చిన్న పట్టణం ప్రశాంత జీవనానికి, ప్రకృతి సౌందర్యానికి నిలయం. అప్పటికే మా కోసం ఎదురు చూస్తూ ఉంది సురేంద్రనాథ్ భార్య లావణ్య. ఆమె చేతి భోజనం ఇంటి భోజనాన్ని మరిపించింది.

మర్నాడంతా సురేంద్ర ఇంట్లోనే మకాం. తర్వాత సురేంద్ర నన్ను ఒక లగ్జరీ బస్సులో ఎక్కించి స్టేషన్‌కు వచ్చి రిసీవ్ చేసుకోమని గూటాల కృష్ణమూర్తి గారికి ఫోన్ చేసి చెప్పాడు. కృష్ణమూర్తిగారు అంతకు ముందే నాకు తెలుసు. బస్ స్టేషన్‌లో ఆయన్ని చూడగానే నేను మహదానందపడ్డాను. ఇద్దరం వారింటికెళ్ళాం. వారు అనేక సంవత్సరాలుగా లండన్‌లో ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా ఉంటున్నారు.

కృష్ణమూర్తిగారికి తెలుగు కవులన్నా, తెలుగు సాహిత్యమన్నా వల్లమాలిన అభిమానం. పేరు మోసిన ఏ తెలుగు కవి లండన్ వెళ్ళినా వారిని సాదరంగా ఇంటికి ఆహ్వానించి స్వయంపాకం తినిపించడమే గాక ఇష్టాగోష్ఠి సమావేశాలు నిర్వహించడం అలవాటు. ఆ అభిమానం కొద్దీ మహాకవి శ్రీశ్రీని, పురిపండ అప్పల స్వామిని సొంత ఖర్చుతో లండన్ పిలిపించి సుమారు ఇరవై రోజులు ఇంట్లో ఉంచుకొని ఆ ఇరువురి కవిత్వాన్ని స్వదస్తూరితో అక్షరబద్ధం చెయ్యడమే కాకుండా ప్రతి కవితనూ వారి చేతనే చదివించి రికార్డ్ చేయించి వందలాది సీడీలు రూపొందించారు. ఆ అపురూప సంపుటాలను తెలుగు వాళ్ళెక్కడున్నా ఎగబడి కొంటారని కృష్ణమూర్తిగారి విశ్వాసం. కాని వారి ప్రయత్నం పాతిక శాతం కూడా ఫలించలేదు. ఆ అప్పు మాత్రం నిప్పుల కుంపటిలా మిగిలిపోయింది.

> మారిషస్‌లో తెలుగువాళ్ళు చాలామంది ఉన్నారు. వాళ్ళంతా వంద సంవత్సరాలకు పూర్వం మన రాష్ట్రం నుండి కూలీలుగా వెళ్ళిన వాళ్ళు. ఆ తరం ఎప్పుడో గతించింది. ఇప్పుడక్కడున్న తెలుగువాళ్లు నాల్గో తరానికి చెందిన వాళ్ళు.

నేను లండన్‌లో ఉన్న నాలుగు రోజులు కృష్ణమూర్తి గారి అతిథిగానే ఉన్నాను. ఆయనొకరోజు విశ్వనాథ కృష్ణ దేవరాయల వారింట్లో నా కవితాగానం ఏర్పాటుచేశారు. కృష్ణదేవరాయలు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి బంధువు. కృష్ణమూర్తిగారి లాగే వారు కూడా తెలుగు కవిత్వమంటే చెవి కోసుకుంటారు.

అక్కడ నా కవితాగానం సుమారు రెండుగంటలసేపు జరిగింది. తర్వాత వారు అపూర్వంగా నన్ను సన్మానించారు. అలాంటి సమావేశాలు లండన్‌లో మరో రెండు రోజులు వేరువేరుగా జరిగాయి. అన్నిటికీ సంధానకర్త కృష్ణమూర్తిగారే. నేను అమెరికాలోనూ, ఇంగ్లాండులోనూ తెలుగుదనం ఉట్టిపడే పంచె, లాల్చీతోనే తిరిగాను.


తర్వాత కృష్ణమూర్తిగారు రెండు దేశాల్లో తెలుగు మిత్రులిచ్చిన బహుమతులన్నిటినీ ప్యాక్ చేసి నాతో పాటు విమానాశ్రయానికి వచ్చి ఇండియా ఫ్లైట్ ఎక్కించి వీడ్కోలు చెప్పారు.

## నా మారిషస్ యాత్ర

మారిషస్ ప్రపంచపటంలో గుర్తుపట్టడానికి వీల్లేనంత చిన్న దీవి. అక్కడి ప్రకృతి పచ్చిక బైళ్ళతో, పంటపొలాలతో విరాజిల్లుతూ వుంటుంది. ఆ దీవి చుట్టూ ఉన్న సముద్ర తీరాలు మారిషస్‌కు ప్రత్యేక ఆకర్షణ. ముఖ్యంగా కవి అన్న ప్రతి వ్యక్తీ చూసి తీరవలసిన ప్రదేశం మారిషస్.

హైదరాబాద్‌లోని పద్మాలయ సంస్థ నిర్మిస్తున్న హిందీ చిత్రం షూటింగ్ సందర్భంగా నిర్మాత జి.హనుమంతరావు, యూనిట్ సభ్యులతో పాటు నన్నూ మారిషస్ రమ్మని పట్టుబట్టారు.

అందరం బొంబే అంతర్జాతీయ విమానాశ్రయం నుండి 1983 జూన్ 8వ తేది బయలుదేరాం. మేం విమానంలో గడిపిన ఆరుగంటల కాలం అర్ధగంటలా గడిచిపోయింది. ప్రయాణికులలో దాదాపు మూడవ వంతు జనం మేంకావడమే అందుకు కారణం. మా బృందంలో హనుమంత రావు, ఆదిశేషగిరిరావు, పేకేటి శివరాం, జితేంద్ర, జయప్రద, నేనూ యూనిట్ సభ్యులు సుమారు ముప్ఫైమంది ఉంటాం. మారిషస్‌లో మా బృందానికి కన్వీనర్, అడ్వయిజర్, ఆర్గనైజర్, హెల్పర్ అన్నీ పేకేటి గారే. ఎప్పుడు ఎవరికేం అవసరమొచ్చినా అందరిచూపులు ఆయనవైపే వెళ్లేవి. పేకేటిది బహుముఖీనమైన ప్రజ్ఞ. అనుకున్న పని సాధించడంకోసం ఎక్కడ ఏది అవసరమో అది ప్రయోగిస్తారు.




మారిషస్‌లో తెలుగువాళ్ళు చాలా మంది ఉన్నారు. వాళ్ళంతా వంద సంవత్సరాలకు పూర్వం మన రాష్ట్రం నుండి కూలీలుగా వెళ్ళిన వాళ్ళు. ఆ తరం ఎప్పుడో గతించింది. ఇప్పుడక్కడున్న తెలుగు వాళ్ళు నాల్గో తరానికి చెందిన వాళ్ళు. వాళ్ళు మాట్లాడే తెలుగు మనకర్థంకాదు. ఐనా మనదేశం నుండి తెలుగువాళ్ళు ఎవరు అక్కడికి వెళ్ళినా అపరిమితమైన ఆనందంతో స్వాగతిస్తారు. శివరాం గారి సహకారంతో నేను మారిషస్‌లోని సముద్ర తీరాలన్నీ చూశాను. అక్కడి ప్రతి బీచ్ చూపరులను పులకింపజేస్తుంది.

మారిషస్ రాజధాని పోర్టులూయిస్. అక్కడొక ఓడరేవుంది. ఒకరోజు శివరాంగారూ, నేనూ వెళ్ళి హార్బరంతా తిరిగి చూశాం. మారిషస్ మన దేశంలాగే స్వతంత్ర ప్రతిపత్తి గల దేశం. అప్పటి దేశాధ్యక్షుడు తెలుగు సంతతికి చెందినవారు. పేరు వీరాసామిరింగడు. వారికి నన్ను కవిగా పరిచయం చేశారు. పేకేటి. ఆయన నా చేత కొన్ని తెలుగు కవితలు చదివించుకొని ఆనందించడమే కాకుండా, మా ఇద్దరికీ ఆత్మీయమైన ఆతిథ్యమిచ్చారు. ఆ విధంగా పన్నెండు రోజులా అందాల దీవిలో గడిపి ఆ అనుభూతులు నెమరువేసుకుంటూ యూనిట్ బృందంతో కలిసి తిరిగి ఇండియా చేరాను.

తర్వాత కొద్ది రోజులకే చైతన్య భారతి విద్యా సంస్థల పాలక మండలి సభ్యులు డాక్టర్ ఉండేల మాలకొండారెడ్డి, బి.యస్.రెడ్డి, యోగయ్య నాయుడు, మస్తానయ్య చౌదరి, కమలాకర్‌రెడ్డి, వి.వి. నారాయణలతో కలిసి నేను మరొకసారి మారిషస్ వెళ్ళాను. ఆ దీవి నేనంతకు ముందు చూసినదే అయినా మరోసారి చూడటం అదృష్టంగా భావించాను. ఒక రోజు అందరం చిన్నపాటి జలాంతర్గామిలో విహరించాం. మేం బసచేసిన హోటల్ నిర్వాహకులు ముప్పూటలా మాకు నచ్చే విధంగా రుచికరమైన పదార్థాలు వడ్డించి అత్తవారింటి అల్లుళ్ళవలె చూసుకున్నారు.

## నా థాయిల్యాండ్ పర్యటన

1988వ సంవత్సరంలో ప్రపంచకవి సమ్మేళనం థాయిల్యాండ్ రాజధాని బ్యాంకాక్ నగరంలో జరిగింది. ఆ సాహిత్య పండుగలో పాల్గొనేందుకు మన రాష్ట్రం నుండి తెలుగు ప్రతినిధులుగా నేను, జె.బాపురెడ్డి, ఉండేల మాలకొండారెడ్డి, ఆచార్య తిరుమల, రిటైర్డ్ హోం సెక్రటరీ సుబ్రహ్మణ్యం, వెలిచాల కొండలరావు, పోస్ట్ మాస్టర్ జనరల్ సి. హెచ్ రాజేంద్రప్రసాద్ వెళ్ళాం.

మాతో పాటు దేశం నలుమూలల నుండి వివిధ భాషలకు చెందిన కవులు, కవయిత్రులు చాలా మంది వచ్చారు. సుమారు నలభై దేశాల నుండి అనేక మంది ఒకరోజు ముందే బ్యాంకాక్ చేరుకున్నారు. మరుసటిరోజు ఉదయం పది గంటలకు 'శ్రీ మెంత్రి ఉమావిజాని' అనే థాయిల్యాండు కవి నేతృత్వంలో సభలు ప్రారంభమయ్యాయి. అక్కడ ప్రారంభోపన్యాసం చేసిన వ్యక్తి తర్వాత ప్రేక్షకుల్లో కూర్చుంటాడు. వేదిక మీద కవితాగానం చేసే వ్యక్తి మాత్రమే ఉంటాడు.

మొదటి రోజు కవితలు వినిపించిన తమిళులు, మళయాళీలు, కన్నడిగులు, హిందీ కవులు వారివారి మాతృ భాషల్లోనే చదివారు. ఇతర దేశాల నుండి వచ్చిన కవులు కూడా తమ కవితల్ని మాతృభాషల్లోనే వినిపించారు. (ఇంకా వుంది)

# కల్యాణవైభవం..!



పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ - పరమేశ్వరిల మనవరాలు (లేట్ బగ్గ సుధాకర్‌రావు - స్వరాజ్యలక్ష్మిల కుమార్తె) శివగామిని - గిరీష్‌కుమార్ (నెల్లూరు అశోక్‌కుమార్ - ప్రమీలల కుమారుడు)ల వివాహం ఈ నెల 13న నెల్లూరులోని కిలారి తిరుపతి నాయుడు కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.

# ప్రతిభను ప్రోత్సహించాలి

- వెంకయ్యనాయుడు




ప్రతిభావంతులైన విద్యార్థులతో యం.వెంకయ్యనాయుడు, ఆచార్య రాజారామిరెడ్డి తదితరులు

ప్రతిభను ప్రోత్సహిస్తే దేశంలో ఎంతోమంది మేధావులను వెలుగులోకి తీసుకు రావచ్చునని రాజ్యసభసభ్యులు, బీజేపీ జాతీయనాయకులు యం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీన వెంకటాచలంలోని స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో స్వర్ణభారత్ ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్‌లు సంయుక్తంగా ప్రతిభా పురస్కారాలను నిర్వహించాయి. ఈ రెండు సంస్థలు కూడా పదేళ్లుగా పదోతరగతి పరీక్షలలో జిల్లా, మండలస్థాయిలో ప్రతిభచూపిన విద్యార్థులకు పురస్కారాలందజేస్తున్నాయి. ఈ సంవత్సరం కూడా జిల్లా, మండలస్థాయిలో పదిపరీక్షల్లో మంచిఫలితాలు సాధించిన 78మంది విద్యార్థులకు పురస్కారాలు అందజేసారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ప్రతిభావంతులను ప్రోత్సహించి ముందుకు నడిపించాలన్న ఉద్దేశ్యంతోనే గత పదేళ్లుగా స్వర్ణభారత్ ట్రస్ట్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. దేశంలో అసంఖ్యాకంగా మేధావులున్నప్పటికి వారికి తగిన ప్రోత్సాహం లేనందువల్లే ఎక్కువమంది విదేశాలకు వలసపోతున్నారన్నారు. మేధావులు, విజ్ఞానవంతులు తమ శక్తి సామర్థ్యాలను భారతదేశ ప్రగతికే వినియోగించాలని ఆయన కోరారు. ప్రభుత్వం వైద్య, విద్యా రంగాలకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపును పెంచాల్సిన అవసరం వుందని, ఈ రెండు రంగాలు ప్రజలకు చేరువలో ఉన్నప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాజారామిరెడ్డి, స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ ఐ.దీపావెంకట్, ట్రస్ట్ సిఇఓ. శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



విక్రమసింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య రాజారామిరెడ్డిని సత్కరిస్తున్న రాజ్యసభ సభ్యులు యం.వెంకయ్యనాయుడు, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్

PDF Compressor Free Version



# 'ప్రేరణ'తోనే ప్రతిభ

ఇన్‌స్పైర్ అంటే ప్రేరణ. సైన్స్ అండ్ టెక్నాలజీ మినిస్ట్రీ ఆధ్వర్యంలో సైన్స్ అండ్ టెక్నాలజీశాఖ సహకారంతో నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలో ఐదు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమమే ఇన్‌స్పైర్.



విద్యార్థులకు బహుమతులందజేస్తున్న ఆచార్య వి.సి.నరసింహారెడ్డి, పక్కన ఆచార్య రాజారామిరెడ్డి, ఆచార్య వి.నారాయణరెడ్డి



'ఇన్‌స్పైరింగ్ ది యంగ్‌మైండ్స్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఇంటర్‌మీడియట్ స్థాయి విద్యార్థులలో సైన్స్‌పై అవగాహన పెంపొందించి ఉన్నత చదువుల్లో వారిని శాస్త్ర అధ్యయనం, పరిశోధనల వైపు ఆకర్షితులను చేయటమే ఈ ఐదురోజుల కార్యక్రమం ముఖ్యోద్దేశం. 17వ తేదీ నెల్లూరు నగరంలోని హోటల్ లియో సమావేశ మందిరంలో నల్గొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.నరసింహారెడ్డి ప్రారంభించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎనిమల్ బయో టెక్నాలజీ అదనపు అధికారి పి.రెడ్డన్న, విక్రమసింహపురి ఉపకులపతి ఆచార్య కె.రాజారామిరెడ్డి, రిజిస్ట్రార్ వి.నారాయణరెడ్డి, పాలమూరు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వియస్‌యూ ఆంగ్ల అధ్యాపకులు నరసింహారావు రచించిన శాస్త్ర పరిశోధన రంగాల్లో ఖ్యాతి గడించిన ప్రముఖుల జీవిత విశేషాలను తెలియజేసే "ఇన్‌స్పైరింగ్ ద యంగ్ మైండ్స్" పుస్తకాన్ని నల్గొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.నరసింహారెడ్డి ఆవిష్కరించారు. 150మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 'ఇన్‌స్పైర్' (ప్రేరణ) కార్యక్రమంలో ఐదురోజులూ హుషారుగా పాల్గొన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వై.పరంధామయ్య కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువత మెడిసన్, ఇంజనీరింగ్‌ల మోజులోపడి సైన్స్ గ్రూప్స్‌లోనికి 10శాతం కూడా రాని ఈ రోజుల్లో ఇన్‌స్పైర్ ప్రోగ్రామ్ తల్లిదండ్రులకు, విద్యార్థులకు మంచి అవగాహన కల్పించింది. నూతనంగా ఏర్పాటుచేసిన 10విశ్వవిద్యాలయాలలో ఇటువంటి కార్యక్రమం ప్రథమంగా జరిపింది నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయమే. మొత్తం 'ప్రేరణ' కార్యక్రమ బాధ్యతలను వియస్‌యు ఉపకులపతి కె.రాజారామిరెడ్డి రిజిస్ట్రార్ నారాయణరెడ్డిలు చేపట్టి చక్కగా నిర్వహించారు. క్యాంపస్ ప్రిన్సిపల్ కె.శ్రీనివాసులురెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు.

ఐదురోజుల ఈ కార్యక్రమం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడింది.




సదస్సుకు హాజరైన విద్యార్థులు, విద్యావేత్తలు



ఈనెల 19వ తేదీన ఓజిలి మండలంలోని పిదపరియ వద్ద ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కేంద్ర క్రీడలశాఖమంత్రి అజయ్‌మాకెన్, పక్కన ఎంపిలు చింతా మోహన్, వి.హెచ్.హనుమంతురావు, జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ తదితరులు

### • దాదాకు

# నల్లేరుపై నడకే!



**రాజకీయరంగంలో మలినమంటని వ్యక్తులకు ఎంతటి గౌరవం, ఎంతటి విలువ వుంటుందనేది ప్రస్తుతం రాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో నెలకొన్న రాజకీయ వాతావరణాన్ని చూస్తే తెలుస్తుంది. ఒక మంచి వ్యక్తి కోసం, సమర్థుడైన నాయకుడి కోసం రాజకీయ రాగద్వేషాలను పక్కనపెడుతున్న అపూర్వ ఘట్టం మన కళ్లముందు సాక్షాత్కారిస్తుంది.**

భారత ప్రథమపౌరుడి ఎన్నికకు రంగం సిద్ధం కావడం తెలిసిందే! యూపిఏ తరపున రాష్ట్రపతి అభ్యర్థిగా సుదీర్ఘ రాజకీయచరిత్రలో ఎటువంటి మలినమంటని నాయకుడు, కేంద్ర ఆర్థికశాఖమంత్రి ప్రణబ్‌ముఖర్జీని ఎంపిక చేయడం జరిగింది. కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం ఈ పదవికి ప్రణబ్‌ను ఎంపిక చేయడం వెనుక ఆయన పట్ల భక్తి కంటే కూడా రాజకీయ కారణాలే ఎక్కువగా వున్నాయి. కాంగ్రెస్‌లో అందరికంటే సీనియర్ ప్రణబ్. ప్రస్తుత ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఒకప్పుడు బాస్. కాని ప్రణబ్‌ను పక్కనపెట్టి మన్మోహన్‌సింగ్‌ను ప్రధానిని చేసారు. 2014లో రాహుల్‌ను ప్రధానిని చేయాలని కాంగ్రెస్ నాయకులంతా పగలు రాత్రి తేడాలేకుండా కలలు కంటున్నారు. పరిస్థితులు బాగుండి 2014లో కూడా యూపిఏకు మెజార్టీ సీట్లు వస్తే, ఎంతో అనుభవమున్న ప్రణబ్‌ముఖర్జీని పక్కనపెట్టుకుని రాహుల్ గాంధీని ప్రధానిని చేయలేరు. అందుకే ముందు చూపుతో, ముందు జాగ్రత్తగా ఆయనని రాష్ట్రపతి పదవిలోకి పంపిస్తున్నారు.

రాజకీయ కోణంలో కాంగ్రెస్ అధిష్టానం ప్రణబ్‌ను రాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టినా మిగతాపక్షాలు ఆయన విషయంలో ఎంతో హుందాగా వ్యవహరిస్తున్నాయి. ఆయన అనుభవాన్ని, ఆయన నిష్కళంక చరిత్రను గౌరవిస్తున్నాయి. దేశంలోని ప్రధాన ప్రతిపక్షమైన బీజేపీలోని కొందరు నాయకులు సైతం దాదా అభ్యర్థిత్వానికి మద్దతు తెలుపుతుండడం విశేషం. రాజకీయ కోణంలో ఎన్డీఏ కూటమి పి.ఏ.సంగ్మాకు మద్దతు తెలపాలనుకున్నా, అద్వానీ వంటి అగ్రనేతలు సైతం తమ అంతరంగాలలో ఆయనను వ్యతిరేకించలేకపోతున్నారు. ఎన్డీఏలో ప్రధాన మిత్రపక్షం దళ్(యూ), అతివాద ధోరణితో వుండే శివసేన వంటి పార్టీలు సైతం దాదా అభ్యర్థిత్వం వైపే మొగ్గుచూపడం విశేషం. దేశం లోని ఎక్కువశాతం జాతీయ, ప్రాంతీయపార్టీలు ఆయనకే మద్దతు పలుకుతుండడంతో ఆయన రాష్ట్రపతిగా ఎన్నిక కావడం లాంఛనప్రాయంగానే మిగలనుంది.

కాంగ్రెస్‌పార్టీని బద్ధశత్రువుగా చూసే పలు రాజకీయపక్షాల నాయకులు సైతం ప్రణబ్‌ముఖర్జీని కాంగ్రెస్‌కోణంలో చూడకపోవడం ఆయన ఇన్నేళ్ల రాజకీయ చరిత్రలో సంపాదించుకున్న వ్యక్తిత్వానికి నిదర్శనం.

### కుటుంబాల్లో చీలికలు..

# జగన్ వైపు చేరికలు

- తండ్రి కాంగ్రెస్‌లో... బిడ్డలు వైయస్సార్సీలో
- అన్నలు ఆ వైపు... తమ్ముళ్లు ఈవైపు

***రాజకీయ నాయకులకు తెలివితేటలు మితిమీరుతున్నాయి. ఒక ఇంట్లో నలుగురు వుంటే, నలుగురికీ నాలుగు పార్టీలు. ఇంటి మీద నాలుగు జెండాలు ఎగురుతుంటాయి. ఒక కుటుంబానికి చెందిన తండ్రీ కొడుకులు, అన్నదమ్ములు వేర్వేరు పార్టీలలో వుండడం, వారి ముందుచూపుకు నిదర్శనం. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వీళ్ల పనులు మాత్రం ఆగకుండా జరుగుతుంటాయి.***

ప్రస్తుతం కాంగ్రెస్‌పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల కొడుకులు చాలా మంది వైయస్సార్ కాంగ్రెస్‌లో వున్నారు. జగన్ మీద అభిమానమున్నా కూడా చాలామంది కాంగ్రెస్ నాయకులు తమ పదవులను వదులుకుని కాంగ్రెస్ నుండి బయటకు రాలేకపోయారు. అయితే తమకు బదులుగా తమ బిడ్డలను జగన్ పార్టీలోకి పంపించేసారు.

మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాంగ్రెస్‌లో వుంటే ఆయన తనయుడు మిధున్‌రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారు. మంత్రి ధర్మాన ప్రసాద్‌రావు కాంగ్రెస్‌లో వుంటే ఆయన తమ్ముడు ధర్మాన కృష్ణదాస్ ఇటీవలే జరిగిన ఉపఎన్నికలలో నర్సన్నపేట నుండి వైయస్సార్‌కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలిచాడు. తాజాగా మాజీమంత్రి స్వర్గీయ పి.జనార్ధన్‌రెడ్డి కుమార్తె విజయారెడ్డి బుధవారం చంచల్‌గూడ జైలులో వున్న జగన్‌ను కలిసారు. వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరడానికి తాను సంసిద్ధంగా వున్నట్లు కూడా ఆమె ప్రకటించారు. అదే సమయంలో ఆమె సోదరుడు పి.విష్ణువర్ధన్‌రెడ్డి మాత్రం కాంగ్రెస్ ఎమ్మెల్యేగా వుండడం గమనార్హం. అలాగే మరో మంత్రి విశ్వరూప్ కుమారుడు కూడా జగన్‌ను జైలులో కలిసారు. ఇలా కాంగ్రెస్‌నాయకుల కుటుంబసభ్యులందరూ జగన్‌వైపు క్యూ కడుతున్నారు. ఇదే వరుస కొనసాగితే అది వృద్ధకాంగ్రెస్‌గా, జగన్‌ది యువకాంగ్రెస్‌గా మారడం ఖాయం.




Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY.**